# పెన్ పవర్

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 31 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా శనివారం 13 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 31 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST SAT 13 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే



**పెన్ పవర్ డెస్క్:**ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన పలు ప్రాజెక్టుల నిర్మాణ పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పరిశీలించారు. శుక్రవారం ఆయన హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించి, పనుల పురోగతిని గగనతలం నుంచి వీక్షించారు. రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత ముఖ్యమైన ఈ ప్రాజెక్టులను వేగవంతం చేయాలనే లక్ష్యంతో ఈ పర్యటన సాగింది.విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధిలో నిర్మితమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, రాయ్‌పూర్-విశాఖ జాతీయ రహదారి, తీరప్రాంత రోడ్లు, పోర్టులు, ఐటీ కంపెనీల నిర్మాణాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హెలికాప్టర్ నుంచే ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ముఖ్యంగా కనెక్టివిటీ ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఉత్తరాంధ్ర స్వరూపమే మారిపోతుందని, అభివృద్ధిలో కొత్త శకం ప్రారంభమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పనుల పురోగతిపై అధికారులతో చర్చించి, వారికి పలు సూచనలు చేసినట్లు సమాచారం.

- హెలికాప్టర్ ద్వారా నిర్మాణ పనుల పురోగతి పరిశీలన
- భోగాపురం ఎయిర్‌పోర్ట్, జాతీయ రహదారి పనులపై ఆరా
- విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టులపై అధికారులతో చర్చ

## విశాఖ నగరాలతో కాదు... ప్రపంచంతో పోటీ పడుతోంది

- విశాఖ మధురవాడలో కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు శంకుస్థాపన
- సుమారు రూ.1,500 కోట్ల పెట్టుబడితో 25 వేల ఉద్యోగాల కల్పన లక్ష్యం
- విశాఖను ఏపీకి ఆర్థిక శక్తి కేంద్రంగా తీర్చిదిద్దుతామన్న మంత్రి లోకేశ్
- ప్రపంచంతో పోటీ పడేలా విశాఖను అభివృద్ధి చేస్తామని హామీ



**పెన్ పవర్ డెస్క్:**విశాఖపట్నం ఇప్పుడు దేశంలోని ఇతర నగరాలతో కాకుండా ప్రపంచంతో పోటీ పడుతోందని, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు విశాఖను ఒక పవర్‌హౌస్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ విశాఖలో తన శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయడం చారిత్రక మైలురాయి అని ఆయన అభివర్ణించారు. శుక్రవారం నాడు విశాఖ మధురవాడలో కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్న తీరును, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు.

**విశాఖ ఐటీ రంగంలో చారిత్రక ఘట్టం**

ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ సుమారు రూ.1500 కోట్ల పెట్టుబడితో విశాఖలో తన కార్యకలాపాలు ప్రారంభించడం

వివరాలు 2లో..



## మద్రాస్ హైకోర్టులో ఏదో తప్పు జరుగుతోంది

### సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

- విజయ్ పార్టీ కేసు.. మద్రాస్ హైకోర్టు పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- కేసుల విచారణ, లిస్టింగ్ విధానంపై వివరణ ఇవ్వాలని ఆదేశం
- హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ప్రతివాదిగా చేర్చి నోటీసులు జారీ

**పెన్ పవర్ డెస్క్:**మద్రాస్ హైకోర్టులో కేసుల లిస్టింగ్, విచారణకు సంబంధించి అనుసరిస్తున్న నిబంధనలపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. “అక్కడ ఏదో తప్పు జరుగుతోంది” అని వ్యాఖ్యానిస్తూ, దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని హైకోర్టును ఆదేశించింది. ఈ కేసులో మద్రాస్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ప్రతివాదిగా చేర్చి నోటీసులు జారీ చేసింది.నటుడు విజయ్ స్థాపించిన ‘తమిళగ వెట్రి కళగం’ (టీవీకే) పార్టీకి సంబంధించిన కరూర్ తొక్కిసలాట కేసు విచారణ సందర్భంగా జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. కరూర్ ఘటనపై మద్రాస్ హైకోర్టులోని రెండు వేర్వేరు బెంచ్‌లు పరస్పర విరుద్ధమైన తీర్పులు ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై సీబీఐ

వివరాలు 2లో..

# విశాఖ ఆర్థిక ప్రగతికి మాస్టర్ ప్లాన్...

## వైజాగ్ ఎకానమీ రీజియన్ పై సీఎం చంద్రబాబు సమీక్ష

- 2032 నాటికి 135 బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- రోడ్లు, పోర్టులతో పాటు 49 కీలక ప్రాజెక్టులపై సమావేశంలో చర్చ
- సమావేశానికి మంత్రులు, 9 జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు హాజరు






**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ సమగ్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 2032 నాటికి ఈ ప్రాంతాన్ని 125 నుంచి 135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇవాళ విశాఖలో వీఈఆర్ మాస్టర్ ప్లాన్‌పై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో వీఈఆర్ పరిధిలోకి వచ్చే 9 జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో వీఈఆర్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా రోడ్లు, రైలు మార్గాలు, పోర్టులు, లాజిస్టిక్స్ వంటి కీలక మౌలిక సదుపాయాలకు సంబంధించి మొత్తం 49 ప్రాజెక్టుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. వాణిజ్యం, పరిశ్రమలు, మున్సిపల్ పరిపాలన, పర్యాటకం, ఐటీ, వ్యవసాయం, విద్య, వైద్యారోగ్యం, నైపుణ్యాభివృద్ధి, విద్యుత్ వంటి ప్రతి రంగానికి వేర్వేరుగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేయాలని సూచించారు.వీఈఆర్ పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న, కొత్తగా చేపట్టాల్సిన రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణంపైనా ప్రత్యేకంగా చర్చించారు. మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు వేగవంతం అవుతాయని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ కీలక సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, పి. నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, డోలా బాల వీరాంజనేయ స్వామి, కొల్లు రవీంద్ర... 9 జిల్లాల కలెక్టర్లు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మరోసారి ఢిల్లీ పర్యటనకు చంద్రబాబు

- ఈ నెల 18, 19 తేదీల్లో ఢిల్లీకి వెళ్లనున్న సీఎం చంద్రబాబు
- రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలపై చర్చించనున్న సీఎం
- కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులతో వరుస సమావేశాలు



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి ఢిల్లీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో ఆయన హస్తినలో పర్యటించి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరపనున్నారు.

వివరాలు 2లో..

## 2027 జనాభా లెక్కలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్...

### అదే సమయంలో కులగణన కూడా!



- 2027 జనాభా లెక్కల నిర్వహణకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- రూ.11,718 కోట్ల బడ్జెట్‌తో రెండు దశల్లో చేపట్టనున్న ప్రక్రియ
- దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ పద్ధతిలో గణన
- జనాభా గణనతో పాటు కులాల వారీగా వివరాల సేకరణకు నిర్ణయం
- ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేసుకునేందుకు సెల్ఫ్-ఎన్యూమరేషన్ అవకాశం

వివరాలు 2లో..

## మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో విషాదం: లోయలో పడిన యాత్రికుల బస్సు..

# 8 మంది యాత్రికులు దుర్మరణం



- అల్లూరి జిల్లాలో యాత్రికుల బస్సు బోల్తా
- చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో లోయలో పడ్డ బస్సు
- భద్రాచలం నుంచి అన్నవరం వెళ్తుండగా ఘటన
- కొనసాగుతున్న సహాయక చర్యలు

- బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించిన ఏపీ ప్రభుత్వం
- అల్లూరి జిల్లా బస్సు ప్రమాద బాధితులకు పరిహారం ప్రకటన
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం
- ప్రమాద స్థలాన్ని, బాధితులను పరామర్శించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- చింతూరు-మారేడుమల్లి ఘాట్ రోడ్డులో 9 మంది మృతి చెందిన ఘటన

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. యాత్రికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లాకు చెందిన 35 మంది యాత్రికులు, ఇద్దరు డ్రైవర్లతో ఓ ప్రైవేటు బస్సు భద్రాచలంలో దర్శనం ముగించుకుని అన్నవరం బయలుదేరింది. చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులోని రాజుగారిమెట్ట వద్దకు రాగానే బస్సు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 37 మంది ఉన్నట్లు తెలుస్తోంది.సమాచారం అందుకున్న చింతూరు పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలిస్తున్నారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో యాత్రికుల బంధువుల స్వస్థలమైన చిత్తూరు జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.



## ఎడిటర్ వ్యూ

# జగన్‌కు విషమ పరీక్షలు మొదలయ్యాయా..?

రాజకీయాలు ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు. ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటాయి. పరిస్థితులను బట్టి కాలమాన స్థితిగతులను బట్టి కూడా రాజకీయాలు మార్పు చెందుతూ ఉంటాయి. వీటిని తట్టుకుని నిలబడడం అనేది నాయకులకు ప్రధాన విషయం. తాజాగా వైసిపి అధినేత జగన్‌కు మరిన్ని విషమ పరీక్షలు ఎదురవుతున్నాయి అన్న వాదన వినిపిస్తోంది. నిజానికి అనేక సమస్యలు అనేక సుడిగుండాలు దాటుకునే జగన్ వచ్చారని ఆ పార్టీ నాయకులు తరచుగా చెప్పే మాట. 2014కు ముందు కాంగ్రెస్ ను ఎదిరించి ఆయన పార్టీ పెట్టడం తర్వాత 2019లో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం దక్కించుకోవడం వంటి పరిణామాలు ఆయన నిబద్ధతకు ధైర్యానికి ప్రతీకగా చెబుతారు. అయితే ఇప్పుడు ఆనాటి పరిస్థితుల కన్నా కూడా మరిన్ని ఎక్కువ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఒకవైపు కీలక నాయకుల అరెస్టు. మరోవైపు చుట్టుముడుతున్న కేసులు. ఇప్పటికే మద్యం కేసులో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డితో పాటు అనేకమంది కీలక నాయకులు అధికారులు కూడా అరెస్టయ్యారు.కొందరు బెయిల్ పై వచ్చారు. ఇక కీలక నాయకుడు జగన్ కుటుంబానికి అత్యంత సన్నిహితులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కూడా జైల్లోనే ఉన్నారు. తాజాగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి జంట హత్యల కేసులో అరెస్టు అయ్యారు. ఈ పరిణామాలు వైసిపికి మరింత ఇబ్బందికరంగా మారుతు న్నాయి. ఎందుకంటే నాయకులను ఆధారంగా చేసుకుని కొన్ని కొన్ని జిల్లాల్లో రాజకీయాలు నడుస్తున్నాయి. ఇప్పుడు అలాంటి నాయకులు జైలు పాలు అయితే పార్టీ పరిస్థితి ఏంటి అన్నది ప్రశ్న.మళ్ళీ కొత్త నాయకుడుని పెట్టుకోవడం పార్టీ డెవలప్ చేసుకోవడం అనేది ఇప్పట్లో సాధ్యమయ్యే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఇది ఇలా ఉంటే వివేకానంద రెడ్డి హత్య కేసు మరోసారి విచారణకు వచ్చింది. దీనిని నెల రోజులలోపు పూర్తి చేయాలని కూడా కోర్టు ఆదేశించింది. ఇది ఒక కీలక పరిణామం. ఇప్పటివరకు జరిగిన విచారణతో పాటు ఇప్పుడు మరి కొంతమందిని కూడా విచారించే అవకాశం కనిపిస్తోంది.ఇక పార్టీ పరంగా నాయకుల మధ్య విభేదాలు ఎక్కడా తగ్గడం లేదు. మరోవైపు కేంద్రం నుంచి వచ్చే సహకారం కూడా అందుబాటులో లేకుండా పోయే సూచనలు కనిపిస్తున్నాయి. బిజెపి మద్దతు దాదాపు సన్నగిల్లే అవకాశం కూడా ఉంది. రాష్ట్రంలో కూటమి బలపడితే అది బిజెపికి మరింత మేలు జరుగుతుంది. వైసీపీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు గమనిస్తే ఇదే స్పష్టంగా కనిపిస్తోంది. దీనిని బట్టి జగన్కు ఇప్పటికన్నా మరిన్ని కష్టాలు ఇబ్బందులు భవిష్యత్ కాలంలో ఎదురవుతాయి అన్నది పరిశీలకులు చెబుతున్న మాట.వీటిని తట్టుకుని నిలబడి వచ్చే ఎన్నికల నాటికి పార్టీని అధికారంలోకి ఏ మేరకు తీసుకు వస్తారన్నది జగన్ సామర్థ్యం పైన ఆధారపడి ఉంటుంది. కానీ ఈలోపే ఆయనపై ఉన్న క్రమ కేసులు కూడా బలపడితే అవి కూడా విచారణకు వస్తే పరిస్థితి ఏంటన్నది మరో ప్రశ్న. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను గమనిస్తే రాబోయే ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం జగన్ పై ఉన్న కేసుల విచారణను వేగవంతం చేయడంతో పాటు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి.అప్పుడు సహజంగా కేంద్రంలోని బిజెపి కూడా కూటమికి సహకరించక తప్పదు. ఈ పరిణామాలను గమనిస్తే జగన్‌కు వచ్చే ఎన్నికలు అంత తేలికగా అయితే సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో ఆయన ఏం చేస్తారన్నది చూడాలి.

# విశాఖ నగరాలతో కాదు... ప్రపంచంతో పోటీ పడుతోంది

- మొదటి పేజీ తరువాయి

ఒక కొత్త టెక్ యుగానికి నాంది అని లోకేశ్ అన్నారు. ఈ పెట్టుబడి ద్వారా తొలుత 8 వేల మందికి, భవిష్యత్తులో 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇప్పటికే వెయ్యి మందితో తాత్కాలిక క్యాంపస్‌ను కూడా ప్రారంభించామని, ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని, కాగ్నిజెంట్‌కు, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మధ్య బలమైన భాగస్వామ్యానికి ఆరంభమని పేర్కొన్నారు. ఈ కేంద్రం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై దృష్టి సారిస్తుందని, తద్వారా విశాఖ డిజిటల్ ఎకోసిస్టమ్ మరింత బలోపేతం అవుతుందని వివరించారు. ఈ క్యాంపస్‌లోని ప్రతి సీటు కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, మన యువత కలలకు, భవిష్యత్తుకు వేదిక అని అన్నారు.

**యువతకు పిలుపు.. చంద్రబాబు, మోదీ స్ఫూర్తి**

కాగ్నిజెంట్‌లో పనిచేసే ఉద్యోగులంతా విశాఖకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని 25 ఏళ్ల యువకుల్లా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, వారి నుంచి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. రాష్ట్రంలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు సృష్టించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి ఆంధ్రప్రదేశ్, విశాఖ, తెలుగు ప్రజలు గర్వపడేలా చేద్దామని అన్నారు.

# 2027 జనాభా లెక్కలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్...

దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద పరిపాలనాపరమైన ప్రక్రియ, జనాభా లెక్కలు-2027కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ పద్ధతిలో చేపట్టనున్న ఈ బృహత్ కార్యక్రమానికి రూ.11,718.24 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ఆమోదముద్ర వేశారు. ఈ జనగణనలో జనాభాతో పాటు కులాల వారీగా వివరాలను కూడా సేకరించనుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.ఈ భారీ ప్రక్రియను రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశలో భాగంగా 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో 'ఇళ్ల జాబితా, గృహ గణన' చేపడతారు. ఇక రెండో దశలో అసలైన 'జనాభా లెక్కింపు' కార్యక్రమాన్ని 2027 ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. అయితే, లడఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మంచుతో కప్పబడిన ప్రాంతాల్లో మాత్రం జనాభా లెక్కింపును 2026 సెప్టెంబర్‌లోనే పూర్తి చేస్తారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో సుమారు 30 లక్షల మంది ఫీల్డ్ సిబ్బంది పాల్గొననున్నారు.

**తొలి డిజిటల్ సెన్సస్... అనేక కొత్త ఫీచర్లు**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఇది 8వ జనాభా గణన కాగా, మొత్తంగా 16వది. ఈసారి దీనిని పూర్తిస్థాయిలో సాంకేతికతను జోడించి డిజిటల్ రూపంలో నిర్వహిస్తున్నారు. డేటా సేకరణ కోసం ప్రత్యేకంగా మొబైల్ అప్లికేషన్‌ను (ఆండ్రాయిడ్, ఐఓఎస్ వెర్షన్లలో) వినియోగిస్తారు. మొత్తం ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 'సెన్సస్ మేనేజ్‌మెంట్ %డ% మానిటరింగ్ సిస్టమ్' పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్‌ను అభివృద్ధి చేశారు. దీని ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనిని రియల్ టైంలో సమీక్షించే వీలుంటుంది.ఈసారి ప్రజలకు 'సెల్ఫ్-ఎన్యూమరేషన్' పేరుతో స్వయంగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నారు. దీంతో పాటు, అత్యంత ముఖ్యమైన అంశం కులగణన. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ 2025 ఏప్రిల్ 30న తీసుకున్న నిర్ణయం మేరకు, ఈ జనాభా గణనలో కులాల వారీగా వివరాలను కూడా ఎలక్ట్రానిక్ పద్ధతిలో సేకరిస్తారు. రెండో దశలో జనాభా లెక్కింపుతో పాటే ఈ ప్రక్రియ జరగనుంది.

**అమలు, ప్రయోజనాలు**

ఎప్పటిలాగే, ప్రభుత్వ ఉపాధ్యాయులు, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన ఇతర సిబ్బంది ఎన్యూమరేటర్లుగా వ్యవహరిస్తారు. తమ సాధారణ విధులతో పాటు అదనంగా ఈ పని చేస్తున్నందున వారికి ప్రత్యేక గౌరవ వేతనం చెల్లిస్తారు. ఈ డిజిటల్ ప్రక్రియ వల్ల డేటా నాణ్యత పెరగడమే కాకుండా, ఫలితాలు అత్యంత వేగంగా అందుబాటులోకి వస్తాయి. 'సెన్సస్-యాజ్-ఎ-సర్వీస్ (%ఋఋ%)' విధానంలో ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు అవసరమైన డేటాను సులభంగా, వేగంగా, యంత్రాలు చదవగలిగే ఫార్మాట్‌లో అందిస్తారు. ఇది విధాన రూపకల్పనకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఈ బృహత్ కార్యక్రమం ద్వారా గణనీయమైన ఉపాధి అవకాశాలు కూడా లభించనున్నాయి. వివిధ సాంకేతిక పనుల కోసం స్థానిక స్థాయిలో సుమారు 18,600 మందిని 550 రోజుల పాటు నియమించుకోనున్నారు. దీని ద్వారా దాదాపు 1.02 కోట్ల పనిదినాల ఉపాధి లభిస్తుందని అంచనా. ఈ డిజిటల్ ప్రక్రియలో పాల్గొనడం వల్ల సిబ్బందికి సాంకేతిక నైపుణ్యాలు కూడా పెరుగుతాయి. గ్రామ, వార్డు స్థాయి వరకు సూక్ష్మస్థాయిలో డేటాను అందుబాటులో ఉంచడం ఈ సెన్సస్ ముఖ్య ఉద్దేశం.

# మద్రాస్ హైకోర్టులో ఏదో తప్పు జరుగుతోంది

- మొదటి పేజీ తరువాయి

విచారణను మధురై బెంచ్ తిరస్కరించగా, కేవలం రోడ్‌షోలకు మార్గదర్శకాలు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై చెన్నై బెంచ్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణకు ఆదేశించడాన్ని అనుచితమని గతంలోనే సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.విచారణ సందర్భంగా జస్టిస్ జేకే మహేశ్వరి మాట్లాడుతూ, "హైకోర్టులో ఏదో తప్పు జరుగుతోంది. మేం దీన్ని పరిశీలించాల్సి ఉంది" అని వ్యాఖ్యానించారు. తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ఎన్.కె. కౌల్ వాదనలు వినిపిస్తూ.. ఈ ఘటనపై తాము ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌పై స్టేను ఎత్తివేయాలని కోరారు. అయితే, ముందుగా హైకోర్టు పనితీరుకు సంబంధించిన అంశాన్ని తేలుస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.సెప్టెంబర్ 27న కరూర్‌లో జరిగిన ఈ తొక్కిసలాటలో 41 మంది మరణించగా, 60 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే.

# మరోసారి ఢిల్లీ పర్యటనకు చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా సాగే ఈ పర్యటనకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది.

షెడ్యూల్ ప్రకారం, డిసెంబర్ 18వ తేదీ సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళతారు. అదే రోజు రాత్రి కేంద్రంలోని కొందరు కీలక నేతలు, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక 19వ తేదీన రోజంతా ఆయన ఢిల్లీలోనే ఉంటారు. పార్లమెంట్ హౌస్‌లో పలువురు కేంద్ర మంత్రులతో వరుస భేటీలు జరపనున్నారు.

ఈ సమావేశాల్లో ప్రధానంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతులపై దృష్టి సారించనున్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి అందాల్సిన సహాయం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టత కోరనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ద్వారా పలు పెండింగ్ అంశాలు కొలిక్కి వస్తాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించిన ఏపీ ప్రభుత్వం

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు-మారేడుమల్లి ఘాట్ రోడ్డులో జరిగిన ఘోర బస్సు ప్రమాద బాధితులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ దుర్ఘటనలో మరణించిన 9 మంది కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించింది.ప్రమాద ఘటనపై స్పందించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చింతూరు ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాము. పరిహార మొత్తాలను వీలైనంత త్వరగా అందజేస్తాం" అని హామీ ఇచ్చారు.

మంత్రి పర్యటనలో స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, జిల్లా సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రోడ్డు భద్రతా చర్యలను కఠినతరం చేయాలని రవాణా శాఖ అధికారులకు మంత్రి సూచించారు.

# ఏపీ సపోర్ట్ లేకపోతే కేంద్రంలో బీజేపీ ఉండేది కాదు: అఖిలేశ్ యాదవ్



సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ మద్దతు లేకపోయి ఉంటే, కేంద్రంలో బీజేపీ కూటమి తిరిగి అధికారంలోకి వచ్చేదే కాదని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన సదర్ సమ్మేళనం ఉత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అఖిలేశ్ మాట్లాడుతూ, "మనం వేర్వేరు రాజకీయ పార్టీల్లో ఉండొచ్చు, కానీ మనమంతా ఒక్కటే. ఇవాళ మనం ఇక్కడ రాజకీయాలకు అతీతంగా కలుసుకున్నాం" అని అన్నారు. భవిష్యత్తులో ఈ ఉత్సవాన్ని మరింత గొప్పగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని తాము వెనక్కి నెడుతున్నామని, రాబోయే ఎన్నికల్లో అక్కడ మళ్లీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు.నగర పర్యటనకు విచ్చేసిన అఖిలేశ్ యాదశ్, ఈ రాత్రికి తాజ్ కృష్ణా హోటల్‌లో బస చేయనున్నారు. శనివారం ఓ ప్రైవేటు సమావేశంలో పాల్గొని, సాయంత్రం 4 గంటలకు లక్నో తిరుగు ప్రయాణమవుతారు. అఖిలేశ్ పర్యటనకు నగరంలోని యాదవ సంఘాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి.

# 8 వేలు కాదు, 25 వేల ఉద్యోగాలు... సీఎం చంద్రబాబు ప్రతిపాదనకు ఒప్పుకున్న కాగ్నిజెంట్

**విశాఖలో కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన**

**సీఎం విజ్ఞప్తితో 25 వేల ఉద్యోగాలు కల్పిస్తామని సీఈఓ ప్రకటన**

**విశాఖను టెక్నాలజీ కేంద్రంగా, నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న సీఎం**

**కాగ్నిజెంట్‌తో పాటు మరో 8 ఐటీ కంపెనీల కార్యకలాపాలకు శ్రీకారం**

**కొత్త కంపెనీల రాకతో రూ.3,740 కోట్ల పెట్టుబడులు, 41,700 ఉద్యోగాలు**




పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన విశాఖపట్నం, ఇప్పుడు టెక్నాలజీ హబ్‌గా రూపుదిద్దుకుంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో బలమైన ఐటీ పర్యావరణ వ్యవస్థను (ఎకో సిస్టం) నిర్మిస్తున్నామని, అందులో భాగంగానే ప్రపంచ ప్రఖ్యాత ఐటీ సంస్థలు విశాఖకు తరలివస్తున్నాయని ఆయన తెలిపారు.

శుక్రవారం నాడు విశాఖపట్నంలోని కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమక్షంలో కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్ కీలక ప్రకటన చేశారు. తమ సంస్థ ద్వారా విశాఖలో 25 వేల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.కాగ్నిజెంట్ సంస్థ మొత్తం రూ.1,583 కోట్ల పెట్టుబడితో ఈ అత్యాధునిక క్యాంపస్‌ను నిర్మించనుంది. 2033 నాటికి మూడు దశల్లో నిర్మాణం పూర్తి కానుండగా, మొదటి దశను 2026 నాటికి అందుబాటులోకి తీసుకురానున్నారు. అప్పటివరకు తాత్కాలిక కార్యాలయంలో కార్యకలాపాలు కొనసాగుతాయి. ఈ క్యాంపస్‌లో ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ వంటి భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి సారించనున్నారు.

**హైదరాబాద్ స్ఫూర్తితో విశాఖ అభివృద్ధి**

ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ, "మూడు దశాబ్దాల క్రితం హైదరాబాద్‌లో ఐటీకి పునాదులు వేశాం. ఆ విజన్ కారణంగానే నేడు ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలకు భారతీయులు నాయకత్వం వహిస్తున్నారు. ఇప్పుడు ఏఐ టెక్నాలజీలో కూడా ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ దిశగానే విశాఖను నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం" అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కాగ్నిజెంట్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఆ సంస్థలో 85 శాతం మంది ఉద్యోగులు భారతీయులే కావడం గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో ఈ క్యాంపస్‌లో లక్ష మంది ఉద్యోగులు పనిచేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

**25 వేల ఉద్యోగాలు... సీఎం చొరవతో కీలక ప్రకటన**

ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం కాగ్నిజెంట్ తొలుత 8 వేల ఉద్యోగాలు కల్పించాల్సి ఉంది. అయితే శంకుస్థాపన కార్యక్రమానికి ముందు సీఈఓ రవికుమార్‌తో ప్రత్యేకంగా మాట్లాడిన చంద్రబాబు, విశాఖ యువత కోసం ఉద్యోగాల సంఖ్యను 25 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కోరికను మన్నించిన రవికుమార్, 25 వేల ఉద్యోగాలు ఇస్తామని ఇవాళ వేదికపైనే ప్రకటించారు. విశాఖకు రావడం తన సొంతింటికి వచ్చినట్టుగా ఉందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

**అభివృద్ధికి చిరునామా విశాఖ**

విశాఖ నగరం అత్యుత్తమ కనెక్టివిటీ, నివాసయోగ్యమైన వాతావరణం కలిగి ఉందని సీఎం తెలిపారు. "భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రో రైలు వంటి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా విశాఖను తీర్చిదిద్దుతాం. దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షితమైన నగరం కూడా ఇదే. 2032 నాటికి విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను 135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం," అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఐటీ కంపెనీలకు ఎకరా భూమిని 99 పైసలకే కేటాయించడం ఒక గేమ్ ఛేంజర్ అని అభివర్ణించారు.

**ఒకే రోజు 9 సంస్థలకు శంకుస్థాపనలు**

కాగ్నిజెంట్‌తో పాటు టెక్ తమ్మిన, సత్వ డెవలపర్స్, ఇమాజిన్నోవేట్, ఫ్లూయెంట్ గ్రిడ్, మదర్సన్ టెక్నాలజీస్, క్వార్ఫ్ టెక్నోసాఫ్ట్ తదితర కార్యాలయాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సంస్థల ద్వారా రాష్ట్రానికి అదనంగా రూ.3,740 కోట్ల పెట్టుబడులు, 41,700 ఉద్యోగాలు లభించనున్నాయి. ఇప్పటికే నగరంలో 150కి పైగా టెక్ కంపెనీలు పనిచేస్తున్నాయని, గూగుల్ కూడా త్వరలో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కోనసీమ తిరుమల వాడపల్లి ఆలయ డైరెక్టర్ సలాదికి సత్కారం



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 12:**ఆలమూరు మండల బేసిక్ మెడికల్ ప్రొవైడర్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమితులైన తెలుగుదేశం మండల ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావును మండల బేసిక్ మెడికల్ ప్రొవైడర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ యూనియన్ నాయకులు బుధవారం అయన నివాసమైన పెదపళ్ళ గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ ఏం రత్నం, వైస్ సెక్రటరీ బలరాం,మండల ప్రెసిడెంట్ మెహెర్ ప్రసాద్, సెక్రటరీ స్వామి ప్రసాద్, డి నాగేశ్వరావు, వైస్ ప్రెసిడెంట్ ధనరాజు, వైస్ సెక్రటరీ మల్లేశ్వరరావు, సభ్యులు మేక సత్యనారాయణ, తాతాజీ, కాశీ,మొహిద్దిన్, నవీన్ ప్రసాద్, రాజు, గంట శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

## 2025: అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జేసీ అపూర్వ భరత్ ఆదేశం



**కాకినాడ, పెన్ పవర్,డిసెంబర్ 12**: జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం-2025 పురస్కరించుకుని ప్రజల్లో వినియోగదారుల హక్కులపై విస్తృత అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు.శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో పౌరసరఫరాలు, విద్య, ఆరోగ్యం, కమర్షియల్ టాక్స్, ట్రాన్స్పోర్ట్, హయ్యర్ ఎడ్యుకేషన్, ఫుడ్ కంట్రోల్ తదితర శాఖల అధికారులు, వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ,డిసెంబర్ 18 నుంచి 24 వరకు వారం రోజుల పాటు జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు,ఇంటర్మీడియట్ కాలేజీల్లో పోటీలు,అవగాహన ర్యాలీలు నిర్వహించి విద్యార్థుల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన పెంపొందించాలి" అని సూచించారు.అలాగే ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల రక్షణ చట్టం-2019పై ప్రజల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు నిర్వహించే పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ,తృతీయ నగదు బహుమతులు అందజేయాలని తెలిపారు.జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 24న జరగనున్న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు.సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆర్.ఎస్.ఎస్. సత్యనారాయణ రాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవుల నాయక్, ఇతర శాఖల అధికారులు,వినియోగదారుల హక్కుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలపై ప్రజా దర్బార్ లో వినతి



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 12:** మండలంలోని పినపళ్ల గ్రామంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామ సర్పంచ్ సంగీత సుభాష్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన ఆలమూరు మండల పరిషత్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన ప్రజా దర్బార్ లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం షెడ్లను గత ప్రభుత్వంలో తొలగించి ఇంటి స్థలాలకు ఆ ప్రదేశాన్ని అప్పగించారని, ప్రస్తుతం గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు అందుబాటులో లేక గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున గ్రామంలో మరొక ప్రదేశంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆ వినతిలో కోరారు. అలాగే ఇటీవల గ్రామంలో ఉన్న గొద్దు కాలువ పై రైతులకు ఉపయోగకరంగా ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయిందని, ఆ స్థానంలో మరొక వంతెనకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారును కోరారు. అదేవిధంగా మండలంలోని దాళ్వా సీజన్ కు పంటలు పండించుకునే రైతులు విద్యుత్ అంతరాయంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రస్తుతానికి రోజుకి 9 గంటలు సరఫరా చేసే విద్యుత్తు పంట నారుమల్లు ముగిసేంతవరకు 24 గంటలు విద్యుత్తు రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చి, సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేకు తెలియజేశారు. దీనిపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో తక్షణమే మాట్లాడి ఆ గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, కృష్ణ ప్రభాస్ సంస్థల అధినేత వంక అన్నవరం, ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి రామయ్య, వెంకట్రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు

# ఘాట్ లోయలో యాత్రికుల బస్సు ఘోర ప్రమాదం



- 9 మంది సంఘటన స్థలంలో దుర్మారణం
- 10 మందికి తీవ్ర గాయాలు
- అధికార యంత్రాంగం సహాయక చర్యలు
- కూటమి నాయకులు దిగ్భ్రాంతి

**చింతూరు, పెన్ పవర్ డిసెంబర్ 12** :చింతూరు నుంచి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న మారేడుమిల్లి, చింతూరు ఘాట్ రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 9 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. ప్రమాదానికి గురైన వారిని వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రోడ్డు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, రాష్ట్ర లెజిస్లేటివ్ చైర్మన్ మరియు ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష దేవి, ఎస్టి కమిషన్ చైర్మన్ వైస్. బొజ్జిరెడ్డి, రంపచోడవరం ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నోక్వాల్ తదితరులు చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు. అరకు నుంచి భద్రాచలానికి వెళ్తున్న ప్రైవేటు బస్సు ఘాట్ రోడ్డులో అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగినట్లు మంత్రులు తెలిపారు. ప్రమాదంలో మరణించిన శైలజ రాణి, శ్యామల, పి. సునంద, శివశంకర్ రెడ్డి, ఎస్వీ నాగేశ్వరరావు, కె. కావేరి కృష్ణ, శ్రీకళ, దొరబాబు, కృష్ణకుమారి మృతదేహాల వద్దకు వెళ్లి మంత్రులు సంతాపం వ్యక్తం చేశారు.

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సమన్వయంతో గాయపడినవారిని హుటాహుటిన ఆసుపత్రులకు తరలించినట్టు మంత్రులు తెలిపారు. క్షతగాత్రులందరికీ వారికి నచ్చిన ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. గాయపడినవారు ఎక్కువగా చిత్తూరు జిల్లాకు చెందినవారని, వారిని స్వగ్రామాలకు తరలించేందుకు ప్రత్యేక స్లీపర్ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రమాద మృతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 2 లక్షల ఎక్స్గ్రేషియా, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 2 లక్షలు, స్వల్ప గాయపడిన వారికి రూ. 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించినట్లు మంత్రులు వివరించారు. ఘాట్ రోడ్లలో రాత్రి వేళల రాకపోకలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు, నేషనల్ హైవేలో ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక సీసీ కెమెరా, గ్రామీణ రోడ్లలో ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక సీసీ కెమెరాను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రులు వెల్లడించారు. చింతూరు డివిజన్‌లో నెట్‌వర్క్ సమస్యలపై పాత్రికేయులు ప్రస్తావించగా, త్వరలోనే సెల్ టవర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులు మరియు మృతుల కుటుంబాలు సంప్రదించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై భారత ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసినట్లు మంత్రులు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని విధాల సహాయం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ పంకజ్ మిశ్రా, డి.సి.హెచ్.ఎస్ నీలాదేవి, అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో పుల్లయ్యతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. జనసేన ముఖ్య నాయకులు పలు పార్టీల నాయకులు సంబంధిత ప్రతి అధికారులు పాల్గొన్నారు.



# ఏ ఆధారం లేని అమ్ములు కుటుంబానికి అండగా..

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..
- కుమారుడు గణేష్ కు ఐదు వేలు ఆర్థిక సాయం..



**కోరుకొండ, పెన్ పవర్, డిసెంబర్ 12:** ఏ ఆధారము లేని అమ్ములు కుటుంబానికి ఎమ్మెల్యే బత్తుల అండగా నిలిచారు. శుక్రవారం ఉదయం కనుపూరు గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో గ్రామానికి చెందిన దొడ్డ అమ్ములు గత పది సంవత్సరాలుగా కనుపూరు గ్రామంలో నివసిస్తుంది. తను విజయనగరం నుండి కనుపూరు గ్రామంలో వివాహం చేసుకొని భర్తతో ఉంటుంది. తనకు తన కుమారుడికి ఆధార్ కార్డు లేకపోవడంతో గవర్నమెంట్ నుండి వచ్చే ఏ పథకము వారికి అందడం లేదని ప్రజా దర్బార్ లో ఎమ్మెల్యే బత్తుల కు తెలిపారు . ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బలరామకృష్ణ ఆ కుటుంబానికి కుమారుడు చదువు నిమిత్తం ఐదు వేలు రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. త్వరలో ఇద్దరికీ ఆధార్ కార్డు వచ్చేలా అధికారులకు సూచనలు చేసి ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం.

## రమణయ్యపేటలో మంచినీటి కుళాయిలను ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.




**కిర్లంపూడి, పెన్ పవర్ డిసెంబర్ 12:** ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగపతినగరం పంచాయతీ పరిధిలో సర్పంచ్ గుడాల శ్రీ లత రాంబాబు ఆధ్వర్యంలో మండల కిర్లంపూడి కేంద్రమైన రమణయ్యపేటలో 46.20లక్షలు జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్, కూటమి శ్రేణులతో కలిసిఆయన ప్రారంభించారు. జలజీవన్ మిషన్ ద్వారా సుమారుగా రూ. పంచాయతీ నిధుల నుండి సుమారు 3 లక్షల 50 వేల రూపాయలతో నిర్మించిన కుళాయిల ద్వారా మంచినీటి కుళాయిలను ప్రారంభించి స్థానిక మహిళలకు అంకితం చేశారు.అలాగే కిర్లంపూడి ప్రభుత్వ హాస్పిటల్ వెనుక సుమారు 3 లక్షల 50 వేల రూపాయల నిధులతో నిర్మించిన బోరుని ఎమ్మెల్యే నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రజలందరికీ పరిశుభ్రమైన త్రాగునీరు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని తెలుపుతూ,.ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్ డి ఈ ఎం స్వామి,ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ బి అప్పలరాజు,ఎంపీపీ తోట రవి,ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు,మండల పార్టీ అధ్యక్షులు వీరంరెడ్డి కాశీబాబు,వీరవరం,కిర్లంపూడి సొసైటీ చైర్మన్లు తోట గాంధీ,కుర్ల చినబాబు,నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు భూపాలపట్నం ప్రసాద్,చదరం చంటిబాబు,కంచుమర్తి రాఘవ,నాయకులు తూము కుమార్,కాళ్ల వెంకటేష్,మండల తెలుగు యువత అధ్యక్షులు గండే కాశీ విశ్వనాథ్,జిల్లా యువత అధికార ప్రతినిధి బొద్దిరెడ్ల సుబ్బారావు,ముక్కోలు సర్పంచ్ జ్యోతుల రాంబాబు,కిర్లంపూడి టౌన్ ప్రెసిడెంట్ మద్దాల మణికంఠ స్వామి,ఎమ్మార్వో చిరంజీవి,ఎంపిడిఓభావిశెట్టి హరికృష్ణ,మండల అధికారులు,కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఢిల్లీ లో ఓటు చోర్ గద్ద చోడ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.




- కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు.

**మండపేట. పెన్ పవర్.డిసెంబర్ 12 :** ఈ నెల 14 ఆదివారం ఢిల్లీ లోని రాంలీలా మైదానం లో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో నిర్వహించే ఓటు చోర్ గద్ద చోడ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామ న ప్రభాకరరావు విజ్ఞప్తి చేశారు. మండపేట లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కు వ్యతిరేకంగా ర్యాలీ లక్షలాది మంది తో నిర్వహిస్తున్నారని చెప్పారు. ర్యాలీ అనంతరం రాంలీలా మైదానం బహిరంగ సభ నిర్వహిస్తారని చెప్పారు.ఇప్పటికే చాలా మంది కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ తరలివెళ్లారని మరికొందరు రేపు వెళతారని తెలిపారు. రాష్ట్రం నుండి ఢిల్లీ కి అధిక సంఖ్యలో తరలి రావాలని ఈ నిరసన కార్యక్రమం జయప్రదం చేయలని విజ్ఞప్తి చేశారు.

# పెండింగ్ ఉన్న టిట్కో గృహాలకు ఈ నెల ఆఖరు లోపు రిజిస్ట్రేషన్ కంప్లీట్ చేయాలి.

* టిట్కో ఎండి సునీల్ కుమార్ రెడ్డి.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 12.** తాడేపల్లిగూడెం ఎల్.అగ్రహారం వద్ద టిట్కో గృహాలను సందర్శించిన టిట్కో ఎండి సునీల్ కుమార్ రెడ్డి ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు తో శుక్రవారం ఉదయం ఏపీ టిడ్కో %వీణ% శ్రీ సునీల్ కుమార్ రెడ్డి టిడ్కో గృహాలను సందర్శించారు. మొత్తం 5376 గృహాలకు గాను 4208 గృహాలకు రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయి మిగతా 1164 గృహాలు పెండింగ్ ఉన్నాయి. పెండింగ్ ఉన్న గృహాలకు ఈ నెల ఆఖరు లోపు రిజిస్ట్రేషన్ కంప్లీట్ చేయాలని, పెయింటింగ్ వర్క్ కంప్లీట్ చేయాలని కమిషనర్ ఏసుబాబు కు ఆదేశించారు. అనంతరం అక్కడ నివసిస్తున్న ప్రజలతో మాట్లాడి అక్కడ సమస్యలు తెలుసుకున్నారు, అక్కడ ఉన్న అన్ని సమస్యలను ప్రభుత్వం తో మాట్లాడి అతి త్వరలో పరిష్కారం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

* ఎన్ ఆర్ ఐ మెడికల్ కళాశాల ఆచార్యురాలు, జనరల్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ కోడే ప్రభాదేవి.
* ఏపీ నిట్ లోని ఉమెన్ గ్రీవెన్ సెల్ ఆధ్వర్యంలో
* విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం.




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 12.** మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎన్ ఆర్ ఐ మెడికల్ కళాశాల ఆచార్యురాలు, జనరల్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ కోడే ప్రభాదేవి సూచించారు. విద్యా మంత్రిత్వ శాఖ, మహిళ శిశు అభివృద్ధి శాఖల ఆదేశాల మేరకు ఏపీ నిట్ లోని ఉమెన్ గ్రీవెన్ సెల్ ఆధ్వర్యంలో
విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధి డాక్టర్ ప్రభాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి విద్య, ఆరోగ్యం ఎంతో ముఖ్యమని చెప్పారు. ప్రస్తుత జీవనశైలిలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఆరోగ్యపరమైన జీవనం కోసం వ్యాయామం, ధ్యానం, యోగా వంటి వాటికి కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. విధి నిర్వహణ ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కౌమార దశలో తీసుకోవాల్సిన ఆరోగ్య సంరక్షణ, హెచ్.పి.పి టీకాల ప్రాధాన్యత, మహిళలు తమ ఆరోగ్య శ్రేయస్సుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పవర్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. సైకాలజిస్ట్ శ్రీవాణి మాట్లాడుతూ విద్యార్థినిలు మానసిక సమతుల్యతను ఎలా కాపాడుకోవాలి, భవిష్యత్తును ఉన్నతంగా ఎలా నిర్మించుకోవాలి అనే విషయాలు గురించి తెలియజేశారు. అనంతరం ప్రభాదేవిని, శ్రీవాణిని ఆచార్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ గ్రీవెన్ సెల్ చైర్మన్ డాక్టర్ ప్రత్యుష, డీన్ స్టూడెండ్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు, విద్యా సంస్థ మెడికల్ ఆఫీసర్ ధర్మ తేజ, పలువురు మహిళా ఆచార్యులు పాల్గొన్నారు.

## కారు ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

* డి టి ఓ సురేష్ అభినందనలు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 12**

కారు ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఒకే యూనియన్‌గా వివాదాలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం శుభ పరిణామమని జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జె.ఎన్. రోడ్డులోని రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో జరిగిన రాజమహేంద్రవరం కారు ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ సమావేశానికి ఆర్టీవో ఆర్ సురేష్, స్థానిక అసోసియేషన్ నాయకులు గెడ్డం రమణ , పి . నాగేశ్వర రావు , ఎస్ఆర్కేటిఆర్ మల్లిబాబు లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం లో అన్ని కారు ఓనర్స్ అసోసియేషన్‌లు కలిసి ఒకే యూనియన్‌గా ఏర్పడి నూతనంగా ప్రమాణ స్వీకారం చేయడం అభినందయమన్నారు. సమస్యల పరిష్కార దిశగా నాయకులపై నమ్మకం, భరోసా కలిగి ఉండాలని, తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖలో 9 సంవత్సరాలు ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం ఉద్యోగుల నమ్మకం ఫలితమని గుర్తుచేశారు. రవాణా శాఖను తమ కుటుంబంగానే భావించాలని సభ్యులకు సూచించారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ అధ్యక్షులు గా మహాలక్ష్మి గుమ్మళ్ల, ఉపాధ్యక్షుడు గా సత్యనారాయణ మట్టపర్తి, కార్యదర్శి గా వీరభద్రరావు మాధవరపు, సంయుక్త కార్యదర్శి గా ఆంజనేయులు మేక, ఖజాంచి గా శ్రీనివాసు మేరెటి, సభ్యులు గా రమేష్ గొంప, షరీఫ్ జోహెబ్, గణపతి చిలకసాని, సత్య వరప్రసాద పాదళ ఎన్నికయ్యారు.

## రూ. 43 లక్షలతో కంబాల చెరువు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు మరమ్మతు పనులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 12:** ప్రజలకు ఉపయోగకరమైన పనులు మాత్రమే కూటమి ప్రభుత్వం చేస్తోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక కంబాల చెరువు వద్ద ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్‌కు రూ. 43 లక్షలతో మరమ్మతు పనులకు కూటమి నాయకులతో కలిసి శ్రీకారం చుట్టారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 36వ డివిజన్ పరిధిలోని ఇదే షాపింగ్ కాంప్లెక్స్ పై భవనంలో నగర పాలక సంస్థ పర్యవేక్షణలో నిరాశ్రయులు, యాచకుల కోసం రాత్రి నైట్ షల్టర్ ఉందన్నారు. ప్రతి రోజు రాత్రి భోజనాలు పెడుతున్నట్టు తెలిపారు. ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్ శిధిల స్థితికి చేరుకుందని, వాటికి మరమ్మతులు చేపట్టతున్నమన్నారు. ఇటీవల గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు చేసేందుకు సుమారు రూ. 60 లక్షలతో శ్రీకారం చుట్టడం జరిగిందని గుర్తు చేశారు. అక్కడి షాపింగ్ కాంప్లెక్స్‌కు రక్షణ గోడ పడిపోయిందని, ఉర్దూ అకాడమీ దారుణంగా తయారైందన్నారు. కూటమి ప్రభుత్వం సుమారు రూ.60 లక్షలతో మరమ్మతులు చేస్తేదన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 16నుంచి జిల్లాలో సంసద్ క్రీడా మహోత్సవ్ -2025

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 12:** పార్లమెంట్ పరిధిలో సంసద్ క్రీడా మహోత్సవ్-2025 కార్యక్రమాలను డిసెంబర్ 16 నుండి 21 వరకు ఎంపీ పురందేశ్వరి మార్గదర్శకత్వంలో, సంబంధిత ఎం ఎల్ ఏ ల సహకారంతో పార్లమెంట్ పరిధిలో సంసద్ క్రీడా మహోత్సవ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపు, గ్రామీణ స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించడం, ఆరోగ్యం - ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడం ఈ మహోత్సవ ప్రధాన లక్ష్యాలన్నారు. మొత్తం 18 మండలాల్లో క్రీడలు జరుగుతాయని, చివరి రోజైన 21వ తేదీన మారథాన్ అవార్డు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.
పాల్గొనదలచిన వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.
ఈ సందర్భంగా రూరల్ ఎం ఎల్ ఏ గోరంట్ల బుచ్చయ్య చౌదరి సంసద్ క్రీడా మహోత్సవ్%-%2025 పోస్టర్‌ను విడుదల చేశారు. యువత సామర్థ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామాలు%-%పట్టణాల తేడా లేకుండా యువత పెద్దఎత్తున పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. ఈ మహోత్సవం రాజమండ్రి పార్లమెంట్ పరిధిలో క్రీడా వాతావరణాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు.




**ఎమ్మెల్సీ సోము వీర్రాజు గారి సందేశం**

ఎమ్మెల్సీ సోము వీర్రాజు గారు కూడా సంసద్ క్రీడా మహోత్సవ్-2025 పోస్టర్‌ను విడుదల చేశారు. యువతలో క్రీడలపై ఆసక్తి పెంపు సమాజాభివృద్ధికి కీలకమని, ఈ మహోత్సవం ద్వారా కొత్త ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారన్నారు. క్రమశిక్షణ, దృఢ సంకల్పం, ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం క్రీడలు మూల స్తంభాలుగా నిలుస్తాయని తెలిపారు. రాజమండ్రి పరిధిలో ఇంత విస్తృతంగా క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం ఒక మంచి ముందడుగై, ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు పాల్గొని ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# నక్షలైట్స్ తుపాకీని వదిలి రాజకీయ ప్రజా క్షేత్రం లోకి రావాలి

* రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ పిలుపు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 12:** నక్షలైట్స్ తుపాకీని వదిలి రాజకీయ ప్రజా క్షేత్రం లోకి రావాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్
వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. దేశ పాలకులు హిడ్మా ను ఎంకౌంటర్ చేయటం, కసబ్ ను ఉరి తీయటంలో గల రాజకీయ ఆంతర్యం ఏమిటని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్
మేడా శ్రీనివాస్ ప్రశ్నించారు. భారత జాతీయ జెండాను గౌరవిస్తునే నక్షలైట్ హిడ్మా సాయుధ పోరాటంలో అమరులయ్యారని, ఓవైసీ పాకిస్తాన్ ఇస్లాంకు జై అంటూనే భారత జాతీయ గీతాన్ని అగౌరవ పరుస్తు పార్లమెంట్ లో కీర్తిపొందడం పై విస్మయం వ్యక్తం చేశారు. నక్షలైట్ ఉద్యమం స్వదేశీ , విదేశీ , దోపిడి పాలనకు , బానిసత్వానికి వ్యతిరేకంగా పురుడు పోసుకుందని, ఉగ్రవాదం విదేశీ మత ఉన్మాదాన్ని ప్రోత్సహిస్తుందని దేశ పాలకులు మాత్రం
ఉగ్రవాద పాకిస్తాన్ తో శాంతి చర్చలు అంటారని ఆయన ఎద్దేవా చేసారు.
నక్షలైట్ లను తుపాకీలతో కాల్చి చంపేస్తుంటారని, ఆపరేషన్ సిందూర్ వంటి భారతదేశ భద్రతా దాడిని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట విని ఆపేసారని అన్నారు. ఆపరేషన్ కగార్ ను ఎందుకు ఆపటం లేదని, నక్షలైట్ లతో శాంతి చర్చలు జరుపటం లేదని, సామాన్య పౌరులను చంపుతున్న తీవ్రవాదులతో మాత్రం చర్చలు జరుపుటకు ఆశక్తి చూపిస్తు న్నారనిపేర్కొన్నారు. సమ న్యాయం అమలు చేయమని పోరాడుతున్న నక్షలైట్ లను చంపి వేయటంలో మర్మమేమిటో సగటు భారతీయులకు అర్థం కావటం లేదన్నారు .
ఎన్ కౌంటర్ లపై వాస్తవమెంతో కేసుల స్పష్టతపై ఎంత మేరకు నిజం ఉంటుందని దేశానికి నక్షలైట్ లతో ప్రమాదమా , తీవ్రవాదులతో ప్రమాదమా స్పష్టత ఇవ్వగల వేదిక దేశ ప్రభుత్వ వ్యవస్థలో ఉందా అని ఆయన ప్రశ్నించారు. హక్కుల కోసం పోరాడే నక్షలైట్ లు అడవిలో వుంటున్నారని, జాతీయ గీతాన్ని గౌరవించమనేవారు పార్లమెంట్ సాక్షిగా భారత్ లో జిహాద్ ప్రకటిస్తామని ప్రకటించుకుంటున్న వారు దేశ చట్ట సభల్లో గౌరవించ బడుతున్నారన్నారు.
తీవ్రవాదానికి అనుకూలంగా పార్లమెంట్ లో వాదిస్తున్న వారు ప్రజా ప్రతినిధులు అవుతున్నారని, హక్కులు కోసం మాట్లాడే



నక్షలైట్లు ప్రమాధికారులు ఎలా అవుతారని ప్రశ్నినించే వారు ప్రజాస్వామ్యంలో ఉండకూడదా అని అన్నారు. ముంబై తాజ్ హోటల్ లో మారణ కాండ సృష్టించిన కసబ్ ను చట్ట బద్దంగా విచారించి ఉరి తీసారని, భారతదేశ విమానాన్ని కాందహార్ విమానాశ్రయం వేదికగా హైజాక్ చేసిన మసూద్ అజార్ ముష్కరులను పాకిస్తాన్ పంపించారని ఆయన గుర్తుచేశారు.
కగార్ వంటి ఆపరేషన్స్ లేకుండా నక్షలైట్ లను చట్ట బద్దంగా నిర్భందించగల వ్యూహం , సమర్థ్యత ప్రభుత్వాలకు లేదా ప్రశ్నించారు. ఎంకౌంటర్స్ సాయుద పోరాటాన్ని ఆపగలుగుతున్నాయా అనే అంశం పై ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయా అన్నారు. హిడ్మా , తదితరులను చంపి సాయుద పోరాటంలో మెరుగైన మార్పులు సాధించ గలిగారా ! అలజడులకు కారకులవుతున్నారా ! స్వదేశీ ఉద్యమకారులను ఎంకౌంటర్స్ చేయటం . విదేశీ ఉగ్రవాదులను చట్టభద్ధంగా శిక్షించటంలో జరుగుతున్న ప్రభుత్వ వైఖరిని ప్రజలు, మేధావులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారన్నారు. భారత ప్రజాస్వామ్యం ఎటు పోతుందని, విప్లవాన్ని ఎంకౌంటర్ చేయటం, ఉగ్రవాదాన్ని చట్ట బద్దంగా శిక్షించటంలో రాజ్యాంగ భద్రత పట్ల సగటు భారతీయులు సమాధానం కోసం ఎదురు చూస్తున్నారని మేడా అన్నారు.

# ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు అగ్నికుల క్షత్రియ సంఘాల కృతజ్ఞతలు



**రావులపాలెం పెన్ పవర్ డిసెంబర్ 12:** కోనసీమ వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలిలో ప్రత్యేక ఆహ్వానితులుగా వానపల్లి గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ వర్గీయుడు మాస్కపల్లి త్రిమూర్తులను నియమించినందుకు ఆ వర్గీయులు ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో త్రిమూర్తులు సహా వర్గ పెద్దలు ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలిపారు.
పాయకరావుపేటకు చెందిన గోశాల అప్పలనరసమ్మ ఇప్పటికే సభ్యురాలిగా ఉన్న నేపథ్యంలో, త్రిమూర్తులకు ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం ఇవ్వడం సంతోషదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వాడపల్లి ఆలయ నిర్మాత పినపోతు గజేంద్రుడి విగ్రహాన్ని ఆలయం వద్ద ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల సహకారాన్ని అందిస్తుందన్నారు.

## అన్నవరంలో సిసి రోడ్లు నిర్మాణాలకు శంకుస్థాపన



**అన్నవరం, పెన్ పవర్ :** కాకినాడ జిల్లా అన్నవరం గ్రామంలో పలుచోట్ల సిసి రోడ్లు నిర్మాణాలకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ శుక్రవారం శంకుస్థాపన చేశారు. పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ కుమార్ రాజా కార్యదర్శి చక్రవర్తిలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పనితీరుపై ఆరా తీశారు. గ్రామంలో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు సూచిస్తూ సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం సుబ్బరాయపురం బీసీ కాలనీలో నూకాలమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. వెలమపేటలో లక్ష్మీ గణపతి ఆలయం వద్ద సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎన్టీఆర్ సెంటర్లో గ్రామపంచాయతీ భవనములో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. కొత్తపేటలోని నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శెట్టి బత్తుల కుమార్ రాజా, పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి, శంఖవరం ఎంపీడీవో కిషోర్, శంఖవరం మండల ఉపాధ్యక్షుడు దారా వెంకటరమణ, జనసేన నాయకులు బాబి, టిడిపి నాయకులు వీర్ల సూరిబాబు,పసుపులేటి చక్రి, బండారు సురేష్ ,పలివెల సతీష్ ,మెరపల నరసయ్య, మద్దు వీరబాబు, పిల్లి ప్రసాద్, రాయవరపు శ్రీను, పోలం చిన్న తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల మండలంలో రాష్ట్ర ఫుడ్ కమిటీ మెంబర్ బి. కాంతారావుసుడిగాలిపర్యటన....



**అడ్డతీగల, పెన్ పవర్, డిసెంబర్ 12:** అడ్డతీగల మండలంలో శుక్రవారం రాష్ట్ర ఫుడ్ కమిటీ నెంబర్ బి. కాంతారావు సుడిగాలి పర్యటన చేశారు. తొలుత గిరిజన సహకార సంస్థ గోదాము మరియురేషన్ డిపోలను తనిఖీ చేశారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాల,ఏపీ రెసిడెన్షియల్ స్కూల్,ఏపీ ఆర్ జూనియర్ కాలేజ్,జడ్పీహెచ్ స్కూల్ మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందించాలని అధికారులకు సూచించారు. చిన్న చిన్న లోపాలను గమనించి సరిదిద్దుకోవాలని, తాను మరలా పర్యటిస్తానని ఇటువంటి లోపాలు మరల పునరావృత్తమైతే కఠిన చర్యలు తప్పవని సంబంధిత అధికారులనుఆయన హెచ్చరించారు. విద్యార్థులతో ముచ్చటించిన ఆయన వారి యోగక్షేమలను అడిగి తెలుసుకున్నారు, విద్యార్థులకు ఎటువంటి సమస్యలు వచ్చినా తనకు నేరుగా ఫోన్ చేయవచ్చని విద్యార్థులకు ఆయన ఫోన్ నెంబర్ ఇచ్చారు. అనంతరం అడ్డతీగల మండలం ఎల్లవరం జడ్పీ స్కూల్ మధ్యాహ్నం భోజనాలను పరిశీలించి సంతృప్తి చెందారు. అనంతరం ఎల్లవరం, పాపంపేట గిరిజన సహకార సంస్థ రేషన్ డిపోను సందర్శించి స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు, రిజిస్టర్లలో లోపాలను గుర్తించి ప్రతి రిజిస్టర్ సరిచూసు కోవాలని మరలా ఇటువంటి పునరావృతం కాకుండా ఉండాలని కాంతారావు హెచ్చరించారు. ఎంఈఓ శ్రీనివాస్, ఎంఈఓ రమేష్, ఫుడ్ కమిటీ సిబ్బంది నళిని కౌసల్యాదేవి, ఏ టి డబ్ల్యు ఇంచార్జ్ చిరంజీవి పాల్గొన్నారు.

## ప్రమాదాలు జరగకుండా డ్రైవర్స్ కి పేస్ వాష్ అండ్ గో నిర్వహించిన జిల్లా పోలీసులు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 12:**ప్రజలకు భద్రత భరోసా కల్పిస్తూ రాత్రి గస్తీని కట్టుదిట్టం చేసి నేరాలు జరగకుండా కట్టడి చేస్తూ, నేషనల్ హై వే పై రోడ్డు ప్రమాదాలు జరగకుండా "డ్రైవర్స్ కి పేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని తూర్పు గోదావరి జిల్లా నిర్వహిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల ప్రకారం జిల్లా లోని వివిధ పోలీస్ స్టేషన్స్ పరిది లో రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రత్యేకంగా పోలీసు బృందాలను, పోలీసు వాహనాలను ఏర్పాటు చేసారు. దీనిలో భాగంగా ముమ్మరంగా వాహనాల తనిఖీలు, రహదారి ప్రమాదాల నివారణ కొరకు డ్రంక్ అండ్ డ్రైవ్ , రాత్రి పూట హైవే పై ప్రయాణించే వాహనదారులకు ఫేస్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించినారు.

## జిల్లాలో తొమ్మిది రైస్ మిల్లర్లకు షోకాజ్ నోటీసులు

★ జేసీ మేఘా స్వరూప్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 12:**తూర్పు గోదావరి జిల్లాలో ఖరీఫ్ 2025-26 ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అనధికార వసూళ్లు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై జిల్లా అధికారులు కఠినంగా స్పందించారు. మురమండ రైతు సేవా కేంద్రానికి చెందిన రైతులు ఐ వి ఆర్ ఎస్ సర్వేలో ఇచ్చిన వివరాల ప్రకారం, ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రతి బస్తా పై కోత విధించడం, రైతుల నుండి అనధికార వసూళ్లు చేయడం వంటి అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. రైతులను నేరుగా ఆర్థికంగా నష్టపరిచే ఈ చర్యలు ధాన్యం కొనుగోలు విధానాలపై తీవ్రమైన ఉల్లంఘనలుగా పరిగణిస్తామని జాయింట్ కలెక్టర్ ఇ.ఒ.ఇ.డి జేసీ మేఘా స్వరూప్ తెలిపారు. ప్రారంభ దర్యాప్తులో అనపర్తి, బిక్కవోలు, చాగల్లు, కడియం, కోరుకొండ మండలాలకు చెందిన మొత్తం తొమ్మిది (9) రైస్ మిల్లులు అనధికార వసూళ్ల ఆరోపణల్లో తీవ్రం గా ప్రస్తావించి నట్లు ఆయన తెలిపారు. వారాహి రైస్ ఇండస్ట్రీస్ (రామవరం), అయ్యప్ప రైస్ మిల్లు (పోలమూరు), సాయి తేజ ఆగ్రో ఇండస్ట్రీస్ (తోసిపూడి), వైష్ణవి రైస్ ఇండస్ట్రీస్ (అనపర్తి), కొదండరామ రైస్ మిల్లు, (పందలపాక), వెంకట సూర్య ట్రేడర్స్ (బ్రాహ్మణగూడెం), సూర్యదత్త ట్రేడర్స్ (బ్రాహ్మణగూడెం), వెంకట సూర్య సుబ్బరాయ రైస్ మిల్లు, (కడియం), విశ్వేశ్వర బియ్యం వ్యాపారులు (వెస్ట్ గోనగూడెం) మిల్లులు ఫిర్యాదుల్లో ప్రస్తావించబడ్డాయి. ఈ మిల్లులపై ధాన్యం/రైస్ అలాట్‌మెంట్ నిలిపివేత, మిల్లులను బ్లాక్‌లిస్ట్ చేయడం వంటి కఠిన చర్యలు పరిశీలనలో ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. సంబంధిత రైస్ మిల్లర్‌లు మూడు రోజుల్లో తమ వ్రాతపూర్వక వివరణను జాయింట్ కలెక్టర్ , ఇ.ఒ.ఇ.డి కార్యాలయానికి సమర్పించాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రైతులకు అన్యాయం జరిగితే కఠిన చర్యలు తప్పవని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అనధికార వసూళ్లు జరిగిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని జేసీ మేఘా స్వరూప్ సూచించారు.

## కాసా చాముండేశ్వరి నియామకానికి గౌడ నాయకుల శుభాకాంక్షలు



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 12:**కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్‌గా కాసా చాముండేశ్వరి నియామకం కావడంతో గౌడ సమాజంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.
ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కోసం కాసా చాముండేశ్వరి దంపతులు శ్రమిస్తారన్న నమ్మకాన్ని నాయకులు వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా గౌడ నాయకులు గూడెల్ల నాగేంద్ర, అత్తిలి వెంకటేశ్వర రావు, వెలిగట్ల త్రిమూర్తులు, మానే గోవిందు, మానే ప్రసాద్, అత్తిలి వెంకట్ తదితరులు ప్రత్యేకంగా కలిసి దంపతులను అభినందించారు. ఆలయ ట్రస్ట్ బోర్డులో ఇలాంటి సేవాభావం కలిగిన వ్యక్తులు అవకాశం పొందడం మంచి పరిణామమని వారు పేర్కొన్నారు.
వాడపల్లి ఆలయం కోనసీమలో భక్తుల ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తున్నందున, ట్రస్ట్ బోర్డులో చేరిన కొత్త సభ్యులు ఆలయ పురోగతికి పని చేస్తారని గౌడ నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక భక్తులు, గ్రామస్తులు కూడా ఈ నియామకాన్ని స్వాగతిస్తూ తమ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రెస్ క్లబ్ ఎన్నికల కోసం జేపీసీ ఏర్పాటు



జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎస్పీలకు వినతి పత్రాలుఇచ్చేందుకు నిర్ణయం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 12**
ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ కు ఎన్నికలు జరిపించాలని జర్నలిస్టు సంఘాలకు అతీతంగా జరుగుతున్న ఉద్యమం రోజురోజుకు పెరుగుతుంది. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు , న్యాయవాది మేడా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమారు 40 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గం పేరుతో నాయకులు గా వ్యవహరిస్తున్న వారి తీరును తీవ్రం గా ఎండగట్టారు. సంస్థల పరంగా కాకుండా వ్యక్తిగత ద్వేషాలతో, కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ ప్రశ్నించే వారి సభ్యత్వాలను తొలగించడం, కొత్త వారికి నిరాకరించడం వంటి చర్యలతో ప్రెస్ క్లబ్ నిర్వహణను వారి గుప్పెట్లో పెట్టుకున్నారని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. ఇక కేసులు కోసం మాట్లాడితే, రాజధాని నుండి రాజమండ్రి వరకు పత్రికలు నడిపే వారి వరకు ఉన్నాయని, సీఎంలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల పైన ఆర్థిక కుంభకోణాలు, లంచాలు కేసులు ఉన్నాయని పలువురు స్పష్టం చేశారు. క్లబ్బులో లేని వారికి, సభ్యత్వాలు ఉన్నాయని, విద్యావంతులకు 20 ,30 ఏళ్లపాటు అనుభవం ఉన్నవారికి, ఆర్ ఎన్ ఐ సర్టిఫికెట్లు వారికి మాత్రము సభ్యత్వాలు ఇవ్వడం లేదని వాపోయారు. గత ఆరేళ్లుగా ఎన్నికలు జరుపుకుండా, జమా లెక్కలు చెప్పకుండా, సభ్యుల సంక్షేమం పట్టించుకోకుండా ఇంకా కుట్రలు, కుతంత్రాలు చేస్తూ వారి అనుచరులతో
భౌతిక దాడులకు దిగుతున్నారని సభ్యులు ఆరోపిస్తున్నారు. గత కలెక్టర్ హయాంలో ప్రెస్ క్లబ్ ఎన్నికలు, సభ్యత్వాలపై డి సి ఓ, డి పీ ఆర్ ఓ, ఆర్డిఓ లతో త్రీ మెయిన్ అధికారులతో కమిటీ వేయడం జరిగింది. ఈ కమిటీ పూర్వపరాలు పరిశీలించి ఎన్నికలు జరిపించే లోగా గత కలెక్టర్ బదిలీ కావడంతో సమస్య మళ్లి మొదలుకొచ్చింది. దాంతో ఉద్యమాన్ని తీవ్రం చేయడానికి మెజారిటీ సభ్యులు సమయత్తమవుతున్నారు.

**ప్రెస్ క్లబ్ ఎన్నికల కోసం జెఏసి ఏర్పాటు...**
ప్రెస్ క్లబ్ కు ఎన్నికలు జరిపించాలనే డిమాండ్ తో పలు యూనియన్లకు చెందిన జర్నలిస్టులతో జాయింట్ యాక్షన్ కమిటీ (జె ఎ సి)ఏర్పాటు అయింది. జేఏసీ కమిటీ ఆధ్వర్యంలోనే జిల్లా అధికారులను, ప్రజా ప్రతినిధులను, మంత్రులను, ప్రెస్ క్లబ్ కు చెందిన మాజీ నాయకులను కలిసి సమస్యను వివరించడానికి ,పరిష్కార మార్గం కనుగొనడానికి సిద్ధమవుతున్నారు. జేఏసీ గౌరవ సలహాదారుడి గా పి. రామ్మూర్తి, చైర్మన్ గా చేబోలు రాజు, కన్వీనర్ గా డి అబ్రహం లింకన్, కో కన్వీనర్ గా వి ,రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ లు గా ఎం.సోమరాజు, , ఆర్గనైజర్ గా జి.గిరీష్ కుమార్ గుప్తా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఐ.దామోదర్ పి.వెంకటేశు, టి.పురుషోత్తమ రాజు, ఎస్.రాఘవేంద్ర, మహిళా మహిళా ప్రతినిధిగా డి .విశాలాక్షి, మీడియా కోఆర్డినేటర్లుగా రత్న కిషోర్ , ఎం రమేష్ లు వ్యవహరిస్తారు. కాగా జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో మెజారిటీ జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ ను, జిల్లా ఎస్పీని కలిసి వినతి పత్రాలు సమర్పించ డానికి సిద్ధమ వుతున్నారు. అధికారుల స్పందన చూసి తదుపరి కార్యాచరణ ఉంటుందని జేఏసీ కమిటీ తెలిపింది

## తల్లపురం 'వెట్ మిక్స్' రోడ్డు ప్రమాదాలకు నిలయం

★ వాహనదారులు బెంబేలు

**పెన్ పవర్ ఉంగుటూరు, నవంబర్ 12:**చేబ్రోలు-తల్లపురం రోడ్డుపై ఐదు నెలల క్రితం వేసిన వెట్ మిక్స్ ( డబ్ల్యు బి ఎం ) రోడ్డు వాహనదారులకు ప్రమాదంగా మారింది. పని పూర్తయిన కొద్ది రోజులకే కంకర రాళ్లు పైకి తేలిపోవడంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయాలపాలవుతున్న ఘటనలు వరుసగా నమోదవుతున్నాయి. నాణ్యత లేని పనులపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
ఈ రహదారిపై రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చేబ్రోలు రైతులు పొలాలకు వెళ్లాలన్నా, తల్లపురం ప్రజలు చేబ్రోలు రావాలన్నా ఈ మార్గాన్నే ఉపయోగిస్తున్నారు. ఉపాధి హామీ నిధుల ద్వారా రూ.49 లక్షలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మంజూరు చేయించగా, జూలైలో వెట్ మిక్స్ విధానంలో మరమ్మత్తు పనులు చేపట్టారు. తదుపరి దశలో బిటుమెన్ రోడ్డు వేయాలని నిర్ణయించినప్పటికీ, కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల సిమెంట్%-%ఇసుక మిశ్రమం ఊడిపోగా, రోడ్డంతా పెద్ద కంకర రాళ్లతో నిండిపోయింది.
ద్విచక్ర వాహనదారుల అవస్థలు
కంకర రాళ్లు రోడ్డుపై చెల్లాచెదురుగా ఉండటంతో ద్విచక్ర వాహనాలు జారిపడటం రోజువారీగా మారింది. ఇప్పటికే పలువురు తీవ్రమైన గాయాలతో చికిత్స పొందుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ ప్రమాదం మరింత తీవ్రమవుతోందని స్థానికులు చెబుతున్నారు.
ప్రభుత్వ నిధుల వృథా
కొద్ది రోజుల్లోనే రోడ్డు ప్రమాదకరంగా మారడం ప్రజల ఆగ్రహానికి కారణమైంది. పన్నుల డబ్బుతో చేసిన రోడ్లు ఇంత త్వరగా



చెడిపోవడం ప్రభుత్వ నిధుల వృథా అని వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు.
"ప్రతిరోజూ ఎవరో ఒకరు కిందపడుతున్నారు. అధికారులు వచ్చి చూస్తే ఈ రోడ్డు పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తుంది. వెంటనే మరమ్మతులు చేయాలి, లేకపోతే పెద్ద ప్రమాదాలు తప్పవు" అని వాహనదారులు వాపోతున్నారు.
అధికారుల స్పందన
రాళ్లు పైకి తేలిన ప్రాంతాలను మళ్లీ చదును చేయించి, తారు రోడ్డు నిర్మాణం చేపడతామని పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్ ప్రజాశక్తికి పేర్కొన్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు విడుదల కాకపోవడంతో గుత్తేదారుడు పనులు నిలిపివేశాడని, బిల్లులు త్వరగా విడుదల చేస్తే పనులు పునఃప్రారంభమవుతాయని తెలిపారు.
ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో తల్లపురం రోడ్డును యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు చేయాలని వాహనదారులు, స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## "అఖండ "ప్రీ రిలీజ్ షో విజయం సాధించాలి.

★ బాలకృష్ణ అభిమాన సంఘం నాయకుడు దినేష్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసిన కూటమి నాయకులు, అభిమానులు.




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 12.**
నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ టు ప్రీ రిలీజ్ చిత్రం అఖండ విజయం సాధించాలని తాడేపల్లిగూడెం జనసేన పార్టీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్,రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జున రావు బాబ్జి ఆకాంక్షించారు. అఖండ టు చిత్రం విడుదల సందర్భంగా వడ్లపట్ల దినేష్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద శ్రీ శ్రీ కాన్ ప్లెక్స్ థియేటర్లో అభిమానులు కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. బాలకృష్ణ అభిమాన సంఘం నాయకుడు దినేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బొలిశెట్టి రాజేష్, వలవలబాబ్జి మాట్లాడుతూ కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ సినిమా ఘనంగా విడుదల కావటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సినిమా అఖండ విజయం సాధించాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో బాలకృష్ణ అభిమానులు కూటమి నాయకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో జనసేన యువనాయకుడు బొలిశెట్టి రాజేష్,గొర్రిల శ్రీధర్, భాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

## మూడు లక్షల రూపాయల చెక్ పంపిణీ .



**రౌతులపూడి పెన్ పవర్ డిసెంబర్ 12.**స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద మండల యుటియఫ్ అధ్యక్షులు హరిబాబు అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి ఆచ్చిరాజు అధ్వర్యంలో శుక్రవారం మూడు లక్షల చెక్కును అందజేశారు. ఇటీవల కాలంలో కోట వీధి పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ అనారోగ్యం కారణంగా మరణించిన బండారు సత్యనా రాయణ మాష్టారు కుటుంబ సభ్యులకు ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నిర్వహిస్తున్న . ది గోదవరి యు టి యఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా మూడు లక్షల రూపాయలు చెక్ ను, మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద జిల్లా యుటియఫ్ అధ్యక్షులు సూరిబాబు చేతులు మీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాష్టారు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ యుటియఫ్ చేసిన కృషి మరువలేనిదని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కోళ్ళ రాంబాబు, ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, అసోసియేట్ అధ్యక్షులు ప్రసాద్ రావు, జిల్లా కార్యదర్శులు నాగరాజు, సీతారామయ్య , మండల అధ్యక్షులు తాత బాబు, మండల కుటుంబ సంక్షేమ కార్యదర్శి గౌరి శంకర్, కార్యకర్తలు రామచంద్రరావు, సింహాచలం, ఎల్లయ్య, వీరబాబు, ఆర్. రమణ మూర్తి, బేతా రమణ , దేవరాజు మరియు మండలం లోని ఉపాధ్యాయులు, సత్యనారాయణ మాష్టారు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## కనుపూరు గ్రామంలో జనవాణి ప్రజా సమస్యల పరిష్కార వేదిక..

పలు సమస్యలను వినతుల రూపంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకి అందజేసిన ప్రజలు..

**కోరుకొండ, పెన్ పవర్, డిసెంబర్ 12:** ప్రజా సేవే ముఖ్యంగా ప్రజలతో మమేకమై రోడ్,డ్రైనేజిలు, విద్యుత్తు, త్రాగునీరు, సాగునీరు సమస్యలను ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ తెలుసుకున్నారు.
శుక్రవారం ఉదయం రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం కణుపూరు గ్రామంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో జనవాణి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే గారికి సమర్పించారు. ఇళ్ళ స్థలాలు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, వీధి దీపాలు, రోడ్లు, సాగునీరు, త్రాగునీరు వంటి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి తో పనిచేస్తోందని బత్తుల తెలిపారు.పి4 కార్యక్రమంలో ఎలాంటి ఆధారం లేని వారిని గుర్తించి వారికి సహాయ సహకారాలు అందించాల్సి ఉంటుందని బలరామకృష్ణ అన్నారు.




ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ ముక్క దేవి దుర్గా రాంబాబు, అడపా శ్రీనివాస్, కరణం రవణ, చల్లారావు, అడ్డాల శ్రీనివాస్,పోలారావు, జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ఆరోగ్య కేంద్రంలో యూనివర్సల్ హెల్త్ కవరేజ్ పై అవగాహన

డి ఎల్ ఎస్ ఎ కార్యదర్శి ఎన్ శ్రీలక్ష్మి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 12**
జిల్లా ఎన్.సి.డి. ప్రోగ్రామ్ అధికారి డా. హరిచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో, యూనివర్సల్ హెల్త్ కవరేజ్ 2025 అవగాహన కార్యక్రమం శుక్రవారం పట్టణ , కంబాలపేట ఆరోగ్య కేంద్రం, లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అధికారి సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్. శ్రీలక్ష్మి పాల్గొని, ప్రభుత్వ వైద్య సదుపాయాలు ఆరోగ్య సిబ్బందికి ఎదురయ్యే సమస్యలపై చట్ట పరమైన హక్కుల గురించి వివరించారు. , జిల్లా లీగల్ సర్వీసెస్ తరపున ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా అందచేస్తున్న వైద్య సదుపాయాల పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.డా. హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం వైద్య రంగంలో చేపట్టిన వివిధ ఆరోగ్య కార్యక్రమాలు, యాఫ్‌లు, సేవల వివరాలను వైద్య సిబ్బందికి వివరించారు.ఈ కార్యక్ర మంలో డా. అఖిలేంద్ర (జిల్లా మెంటల్ హెల్త్), డా. అనూహ్య (యు. పి. హెచ్. సి., కంబాలపేట), జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది, పట్టణ ఆరోగ్య కేంద్రం, కంబాలపేట హెచ్.వీ., ఏ ఎం ఎం లు, ఆశలూ సిబ్బంది పాల్గొన్నారు.

# జనవరి 25 న మాదిగ ఆత్మీయ సమ్మేళనం



**అంబాజీపేట, పెన్ పవర్, డిసెంబరు ,12.** పద్మశ్రీ మంద కృష్ణమాదిగ సారద్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్గీకరణ చేసి పెద్దమాదిగ అయ్యారని.
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ హెచ్ ఆర్ డి సభ్యుడు నేదునూరి వీర్రాజు అన్నారు. అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో నాయకుడు ఉందుర్తి నాగబాబు అద్యక్షతన పత్రికా విలేఖర్లు సమావేశం జరిగింది.
ఈ సమావేశంలో వీర్రాజు మాట్లాడుతూ ఈనెల 11న జరిగిన వనబోజనాలు అన్ని పార్టీలలో ఉన్న మాదిగలు అని వేదిక మీద ఉన్న నాయకులు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని నిన్న జరిగిన మాదిగ వనభోజనాలు కేవలం వైసిపి పార్టీది మాత్రమే నని అన్నారు. తెలుగుదేశం పార్టీలో ఉన్న కొంతమంది తెలుగుదేశం పార్టీలో పని చేస్తూ వైసిపి పెట్టిన వనబోజనాలలో పాల్గొన్నారని వారు కుడా కేవలం సింగిల్ డిజిట్లోనే ఉన్నారని వారి వ్యవహారం పార్టీ చూసుకుంటుందని అన్నారు.
పద్మశ్రీ మంద కృష్ణమాదిగ సారద్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్గీకరణ చేసి పెద్దమాదిగ అయ్యారని. మాదుగజాతికి రాజ్యాంగ పలాలు అందించిన చంద్రబాబు నాయుడు ను వైసిపి ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ చరిత్రహీనుడు అన్న విషయాన్ని తీవ్రంగా ఖండించారు.
2026 జనవరి 25 వ, తేదీన పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆద్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మాదిగ ఆత్మీయ సమ్మేళనం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ఎన్.డి.ఎ కూటమి మంత్రివర్యులు వంగలపూడి అనిత, పోలిట్ భ్యూరో సభ్యులు జాతీయ ప్రధానకార్యదర్శి వర్ల రామయ్య, ఎం.పి. యెన్నేటి కృష్ణ ప్రసాద్ లతో పాటు మాదిగ సాజికవర్గ శాసనసభ్యులు, నాయకులను ఆహ్వానించి పద్మశ్రీ మంద కృష్ణమాది నేతృత్వంలో కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రర్యమానికి పద్మశ్రీ కృష్ణ అన్న సైన్యంతో పాటు కూటమి నాయకులము కుడా శక్తివంచన లేకుండా కృషిచేసి విజయవంతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో
ఈతకోట నాగరాజు, దిగుమర్తి చిట్టిబాబు, చేట్ల రవి, మంద నాగరాజు, మమ్మిడివరపు కృష్ణకాంత్, లంక రెడ్డి, తొత్తరమూడి ఆనంద్, ఈతకోట శ్రీను,నేదునూరి శ్రీను, నేదునూరి రాము, నవుండ్రు శ్రీనివాస్ తదితుర్లు ఈ పత్రికా విలేఖర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు

## ప్రతి రక్తదత ప్రాణదాతతొ సమానం

* మునిసిపల్ కార్యాలయంలో ఘనం గా రక్తం దాన శిబిరం. పాల్గొన్నా మునిసిపల్ సిబ్బంది, విద్యార్థులు.




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 12.**గౌరవ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయం నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు, మునిసిపల్ అధికారులు, విద్యార్థులు కలిపి 50 పైగా రక్తదానం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు సిబ్బంది మరియు ఆదిత్య డిగ్రీ కాలేజ్ వాసవి డిగ్రీ కాలేజ్ విద్యార్థులు రక్తదానం కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. రక్త దానం చేసిన వారికి జనవరి 26 జరిగే రిపబ్లిక్ కార్యక్రమంలో సర్టిఫికెట్ల అందజేస్తారు అని మునిసిపల్ కమిషనర్ తెలియజేసారు.

## ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం..

* తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి..



**కోరుకొండ,పెన్ పవర్,డిసెంబర్ 12:**రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రాష్ట్ర కార్యదర్శి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి బూరుగుపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల సమస్యలను స్వయంగా ప్రజలకు తక్షణ పరిష్కారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాదర్బార్ వేదిక ద్వారా ప్రజల సమస్యలు సులభంగా పరిష్కారం కానున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వినతులను సమర్పించారు. వాటిని ఒక్కొక్కటిగా స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని బొడ్డు వెంకటరమణ చౌదరి సూచించారు. అంతేకాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కంటే కేశవరావు, తనకాల నాగేశ్వరావు,అడపా శ్రీనివాస్,పుప్పాల వెంకట రత్నం, కొయ్య శామ్యూల్, మాత ప్రభు తదితరులు పాల్గొన్నారు

## రాజవరం గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన..

* ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బొడ్డు..



**కోరుకొండ, పెన్ పవర్, డిసెంబర్ 12:**కోరుకొండ మండలం రాజవరం గ్రామంలో 32 లక్షల రూపాయల వ్యయంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి శంకుస్థాపన చేశారు.
ఈ కార్యక్రమంలో అడపా శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ దుర్గాదేవి రాంబాబు,అడ్డాల శ్రీను, ఎర్రం శెట్టి పోలారావు,దొరబాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తనకాల నాగేశ్వరావు, కంటే కేశవరావు,అడపా వీరబాబు,కొయ్య శామ్యూల్, మాత ప్రభు, బిజెపి పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గా తుగ్గలి నాగేంద్ర

* కోనసీమ శాలివాహనులు హర్షం



**అంబాజీపేట, పెన్ పవర్, డిసెంబరు 12:**ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవులలో
శాలివాహనులు మాజీ ఫెడరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర కర్నూలు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గా నియమించడం పట్ల కోనసీమ శాలివాహన సంక్షేమ సంఘం హర్షం ప్రకటించారు. కూటమి ప్రభుత్వం శాలివాహనులు అన్నిరంగంలో పదవుల కేటాయిస్తూ ఎంతో తోడ్పడుతుందని శాలివాహనులు హర్షం వ్యక్తం చేసినారు. శాలివానులకు ఒక ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, బిజెపి నాయకులను కోరినారు. శాలివాహంలో కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటారని ఆశాభావం వ్యక్తం చేసినారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మానేపల్లి వీర బ్రహ్మంగారు కార్యదర్శి దాలిపర్తి భీమేష్ రావు గారు సలహాదారుడు దొడ్డిపట్ల శ్రీనివాస్ గౌరవ సలహాదారుడు వెల్ల త్రిమూర్తులు సఖినేటిపల్లి పెద్దిరాజు పుల్లేటికుర్తి రత్నం మంతెన శ్రీనివాస్ ర్యాలీ శ్రీనివాస్ వాడియార్ ఆదుర్తి నమ శివాయ ఆదుర్తి నారాయణమూర్తి చిరుతపుడి హేమలత మంతెన లక్ష్మి సంఘ పెద్దలు హర్షం ప్రకటించినారు

## కాలభైరవ స్వామి మహొత్సవాలలో డ్రోన్ కెమెరాలతో పోలీసుల నిఘా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 12:**తూర్పుగోదావరి జిల్లా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కాలభైరవ స్వామి జాతర మహోత్సవాల సందర్భంగా డ్రోన్ కెమెరాలతో పోలీసులు నిఘా నిర్వహించారు.
జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకున్న తూర్పుగోదావరి జిల్లా లో పోలీసులు జాతరలో మొదటిసారిగా ప్రయోగించారు. జిల్లా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కాలభైరవ స్వామి జాతర మహొత్సవాలలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు, ట్రాఫిక్ ఇబ్బందులు, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా డ్రోన్ కెమేరాలు ఎగురవేసి పరిస్థితులు సమీక్షించుకుని, పోలీసులు చర్యలు తీసుకున్నారు.
ఇదేవిధంగా జిల్లాలో జరిగే ప్రతి జాతర, ఉత్సవాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా కొనసాగుతుందని అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్

* ప్రజల్లో విశ్వాసం పెంచుతున్న కార్యక్రమం



**కాకినాడ పెన్ పవర్, డిసెంబర్ 12:** ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయం ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు విస్తృత స్పందన లభిస్తోంది. 34వ వారపు ప్రజా దర్బార్‌కు ప్రజలు భారీగా హాజరై తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు సమర్పించారు. రీయింబర్స్‌మెంట్, పింఛన్లు, తల్లికి వందనం, సీఎంఆర్ఎఫ్, చంద్రన్న బీమా, రేషన్ కార్డులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రజలు రాజ్యసభ సభ్యుల కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఇన్‌ఛార్జ్ మేకా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ
"ప్రజల్లో నమ్మకం కలిగించే విధంగా ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్‌ను నిరంతరం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో రావడం సానా సతీష్ బాబు ప్రజల పట్ల చూపుతున్న కట్టుబాటు ప్రతిఫలితమే" అన్నారు. ఈ వారం మొత్తం 20 అర్జీలు స్వీకరించగా, అందులో 10 అర్జీలపై వెంటనే చర్యలు తీసుకొని సంబంధిత అధికారులను స్పందింపజేశామని మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. మిగతా అర్జీలను కూడా సంబంధిత శాఖలకు పంపించామని చెప్పారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డా. చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా దర్బార్ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందని అన్నారు. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న అనపర్తి నియోజకవర్గం కాండ్రేగుల గ్రామానికి చెందిన యువకుడికి ఆపరేషన్ కోసం కావాల్సిన ఎన్‌ఓసీ జారీకి కార్యాలయ సిబ్బంది వెంటనే స్పందించడం ప్రజా దర్బార్ ప్రభావాన్ని తెలియజేస్తోంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేశ్వరరావు,న్యూటన్ ఆనంద్, జున్నూరు బాబ్జి,హరి,సిరియాల కొండబాబు, కామాడి దశరథ్, డీఆర్సీసీ సభ్యులు ముత్యాల అనిల్, ఐటిడిపి పాలిక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఓబీసీ రాష్ట్ర నేత అయినవిల్లి సత్తిబాబు గౌడ్‌కు ఘన సన్మానం



**ఆలమూరు పెన్ పవర్ డిసెంబర్ 12:**భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అయినవిల్లి సత్తిబాబు గౌడ్‌ను ఘన సత్కారం లభించింది. శుక్రవారం జొన్నాడలోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పూలమాలలు, దుస్సాలువాతో సత్కరించారు.
ఈ సందర్భంగా సత్తిబాబు గౌడ్ మాట్లాడుతూ "నియోజకవర్గంలో బీసీ వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నాను. బీసీ వర్గాలకు వివిధ రంగాల్లో విజయాలు రావడం సంతోషకరం" అన్నారు. గత 35 సంవత్సరాలుగా బీజేపీలో సేవలందిస్తూ, అనేక బాధ్యతలు నిర్వహించానని, విద్యార్థులు-యువతలో దేశభక్తి, జాతీయ భావాలు, నైతిక విలువలు పెంపొందించే దిశగా కృషి చేస్తున్నామని అన్నారు.
నియోజవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడం తన ధ్యేయమని, బీజేపిపై విశ్వాసం ఉన్న వారందరినీ పార్టీలోకి ఆహ్వానించి సముచిత స్థానం కల్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆత్రేయపురం,ఆలమూరు రావులపాలెం మండలం బీసీ నాయకులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ మహా

## సభలకు వెళ్లిన నాలుగు డిపో ల ఆర్టీసీ ఉద్యోగులు.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 12.**ఏపీ పిటీడీ నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ ద్వితీయ మహాసభకు పశ్చిమ గోదావరి జిల్లా లోని నాలుగు డిపో ల నుంచి ఆర్టిసి ఉద్యోగుల శుక్రవారం విజయవాడ బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వైవి రావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్య లు 2024 మార్చ్ నుండి పదవీ విరమణ, చనిపోయిన తర్వాత ఉద్యోగుల కు వారి వారసులకు టర్మినల్ లివ్,గ్రాడ్యుయేట్ చెలింపులు, వేతన బకాయిలు పరిష్కరం పై వినతిపత్రం అందజేస్తం అని తెలిపారు.

## పేకాట శిబిరంపై దాడి 8 మంది అరెస్ట్

**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 12:**మండల కేంద్రం ఆత్రేయపురంలో శు క్రవారం పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం తో స్టేషన్ ఎస్సై ఎస్. రాము తన సిబ్బందితో కలిసి ప్రత్యేక దాడి నిర్వహించారు. స్థానికంగా ఇలాంటి జూద కార్యకలాపాలు విస్తరిస్తున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన నిఘా పెట్టారు.
దాడిలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 15,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూద కార్యకలాపాలకు వీరంతా ప్రోత్సాహం ఇస్తున్నారని గుర్తించిన పోలీసులు సంబంధిత సెక్షన్‌లతో కేసు నమోదు చేశారు.
ఎస్సై ఎస్. రాము మాట్లాడుతూ
"మండల పరిధిలో జూదం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించము. ఇలాంటి అన్యాయ కార్యకలాపాలపై నిరంతర దాడులు కొనసాగిస్తాం. ప్రజలు కూడా ఇలాంటి విషయాలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి" అని తెలిపారు.



# సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు త్వరగా పునరుద్ధించాలి.

రీజనల్ ఇంజినీరింగ్ చీఫ్ ప్రభాకర్



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 12.** తాడేపల్లిగూడెంలో మున్సిపల్ పరిధిలో ఉన్న పంపు హౌస్ కు రాజమండ్రి రీజనల్ ఇంజినీరింగ్ చీఫ్ ప్రభాకర్ సందర్శించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిశీలించి పనులు పునరుద్ధించమని ఆదేశించారు, వాటర్ టెస్టింగ్ చేసి పిహెచ్ విలువ పరిశీలించడం జరిగింది. వచ్చే వేసవి కాలంలో నీటి సమస్య లేకుండా చూడాలి అన్నారు. ఈ కార్యక్రమం లో కమిషనర్ శ్రీ ఏసుబాబు, మున్సిపల్ ఇంజినీర్ వెంకట రమణ, అందరూ డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, పంపు హౌస్ సిబ్బంది హాజరు అయ్యారు.

# డైమండ్స్ లయన్స్ రీడింగ్ యాక్షన్ కార్యక్రమం.




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 12.** విద్యార్థుల లో ప్రతిభను సృజనత్మకమైన కళలను వెలికి తీయడం ప్రోత్సహించడమే 316 జి జిల్లా లయన్స్ లక్ష్యం అని డైమండ్స్ లయన్స్ క్లబ్ అడ్మిస్ట్రేటర్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు.
కడియద్ద జిల్లా పరిషత్ స్కూల్ లో లయన్ కొత్త సుభద్ర ఆధ్వర్యంలో
విద్యార్థిని విద్యార్థుల్లో పఠనాశక్తి పెంచడానికి 316జి జిల్లా గవర్నర్ ఎన్ వి వి యస్ పాపా రావు నాయుడు టీం అందించిన పుస్తకాలు ను లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు చేతులు మీదుగా లైబ్రరీయన్ సుధాలక్ష్మి కి అందించారు పుస్తకాల ద్వారా సంస్కృతి సంప్రదాయాలు భారతదేశ చరిత్ర. నీతి కథలు జంతువులు పక్షులు. పర్యావరణ%శీ%పై అవగాహనకు అలానే ఈ కథల వ్రాతపోటీలను నిర్వహించుటకు ఏర్పాటు చేశారు. స్కూల్ ప్రధాన ఉపాధ్యాయరాలు పరిమి సుబ్బలక్ష్మి నప్రారంభించారు. లైబ్రరీయన్ సుధా లక్ష్మి పిడి కొత్తసుభద్రలు పర్యవేక్షించారు స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డి. రామవరంలో మనమిత్ర కార్యక్రమం...




**అడ్డతీగల, పెన్ పవర్, డిసెంబర్ 12** :రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతీ శుక్రవారం వాట్సప్ గవర్నెన్స్, మన మిత్ర కార్యక్రమం ప్రతీ సచివాలయం లో సిబ్బంది తమకు కేటాయించిన క్లస్టర్ నందు మ్యాప్ కాబడిన ఇండ్లను సందర్శించి మన మిత్ర సేవలు గురించి వివరించి, ప్రజలకు అవగాహన కల్పించి వారికి ప్రజల చేతిలో ప్రభుత్వం అని ప్రభుత్వ వాట్సాప్ నంబరు 9552300009 ద్వారా ప్రజలకు కావలసిన సేవలను పొందటానికి వారికి అడ్డతీగల ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అందులో భాగంగా డి.రామవరం గ్రామ పంచాయతీ సందర్శించి ప్రజలందరికీ అవగాహన కల్పించుటలో సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు ఎంపీడీవో జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాయలం సిబ్బంది పాల్గొన్నారు.ు

# సౌరవిద్యుత్తు వాడకం శ్రేయస్కరం

ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 12.** గృహ అవసరాలకు సోలార్ ప్యానల్ వాడడం ఎంతో శ్రేయస్కరమని స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నల్లజర్ల గ్రామంలో శుక్రవారం విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానెల్లను ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. వాటిని గృహాలకు అమర్చుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్తు పొందవచ్చు అన్నారు. సోలార్ విద్యుత్తు అన్ని రకాల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సోలార్ ప్యానల్ పెట్టుకునే వారికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని అలాగే బ్యాంకులు సైతం రుణ సదుపాయం కల్పిస్తున్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యుత్ అధికారులు ప్రజలకు సౌర విద్యుత్ గురించి అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బ్రహ్మ రాజు, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన విద్యుత్ శాఖ ఏడిఈలు, ఏఈలు, టాటా కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విక్షిత్ భారత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు

**కాకినాడ, పెన్ పవర్,డిసెంబర్ 12:** లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు "విక్షిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ - 2026" రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తృతీయ సంవత్సరం విద్యార్థులు ఎస్. అను భార్గవి, బి. సూర్యప్రకాశ్, డేటా సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆకుల సాయి పవన్ ఈ రాష్ట్రస్థాయి ఎంపికలో నిలిచారు. రెండు దశలను ఆన్లైన్‌లో నిర్వహించగా, మూడవ దశ రాష్ట్రస్థాయి పోటీలు శనివారం గుంటూరు నాగార్జున విశ్వవిద్యా లయంలో జరగనున్నట్లు తెలిపారు. పది విభాగాల్లో నిర్వహించిన రెండు దశల పోటీలలో మూడు విభాగాల్లో ఆదిత్య విద్యార్థులు ఎంపిక కావడం విశేషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ,"విద్యార్థులు భావి భారత రథసారథులు. సేవా కార్యక్రమాలు, విద్య, సాంస్కృతిక, సాంకేతిక రంగాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ముందుండడం అభినందనీయం. రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన విద్యార్థులు జాతీయస్థాయిలో కూడా రాణించాలని ఆశిస్తున్నాం" అన్నారు. ఎంపికైన విద్యార్థులను



ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి,వైస్ ప్రిన్సిపల్ సి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు,డి.అశ్వినితో పాటు అధ్యాపకులు అభినందించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.



ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.

**కిర్లంపూడి, పెన్ పవర్, డిసెంబర్ 12:** ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకువచ్చారు. పలువురు మహిళలు, రైతులు, విద్యార్థులు, వృద్ధులు వరుసగా వినతిపత్రాలు అందజేశారు. గ్రామాల్లో కొనసాగుతున్న లో-ఓల్టేజ్ ఇబ్బందులు, పంట సాగులో ఎదురవుతున్న విద్యుత్ అంతరాయాలు, కాలువల మరమ్మత్తులు, రోడ్లు దెబ్బతినడం, పింఛన్ల సమస్యలు, హౌసింగ్ పనుల్లో నిలకడ లేకపోవడం వంటి అంశాల పై 104 వినతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు విన్న వెంటనే ఒకొక్క ఫిర్యాదుపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను పిలిచి ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక సమావేశం నిర్వహించి పరిష్కారాలు చూపాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో పయనించి ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా దర్బార్‌ను ప్రతి నెలా నిర్వహిస్తామని, గ్రామాల్లో తిరిగి మరిన్ని సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని నెహ్రూ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, సొసైటీ చైర్మన్ లు కుర్ల చిన్నబాబు, తోట గాంధీ,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంరెడ్డి కాశీబాబు, నియోజక వర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు చదరం చంటిబాబు, తూము కుమార్, కాళ్ళ వెంకటేష్, ఎంపీడీఓ భావిశెట్టి హరికృష్ణ, తహసీల్దార్, జె. చిరంజీవి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నూనె గింజల పంటలను సాగు చేయాలి..

అవగాహన కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

**సీతానగరం, పెన్ పవర్, డిసెంబర్ 12:** మెట్ట ప్రాంతాల్లో సార్వా వరి తరువాత రైతులు నూనె గింజల పంటలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చు అని తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా, చల్లా వెంకట నరసింహ రావు రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వ వరి పంట తర్వాత నూనె గింజలైన నువ్వులు వేరుశనగ వంటి నూనె గింజల పంటలు వేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని పెట్టుబడి వ్యవసాయం తక్కువని చీడపీడల తాకిడికి తక్కువగా ఉండి పోషక విలువలు ఉన్న నూనె గింజ పంటలను ఉత్పత్తి చేసుకోవచ్చున్నారు. ఒక ఎకరా వరికి కావాల్సిన నీటితో 5 ఎకరాలను నువ్వు పంట సాగు చేయవచ్చని తెలిపారు ప్రధాన శాస్త్రవేత్త. డా, మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ తక్కువ తడులతో ఎరువులతో ఆరోగ్యమైన పంటను తీసుకోవచ్చు అన్నారు తొలి దశలో కలుపు నివారణ సమతుల్యమైన ఎరువులను వాడుతూ కేవలం రెండు మూడు తడుల్లో పంటను తీసుకోవచ్చు అన్నారు కేవలం 70 85 రోజుల్లో రబీ పండగ పండిస్తే ఎకరాకు నికర



ఆదాయం రెండు లక్షలు వరకు లాభదాయకమన్నారు. డా. రామభద్ర రాజు మొక్కజొన్న పంట యాజమాన్య పద్ధతులు వివరించారు వ్యవసాయ శాఖ అధికారి గౌరీ దేవి మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో నువ్వులు వేరుశనగ పంటలు పట్ల రైతుల్లో అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నామన్నారు. నెమ్మదిగా కొంత విస్తీర్ణం నూనె గింజల సాగు ఈ సంవత్సరం కేటాయిస్తామన్నారు అనంతరం ఇనగంటి వారిపేట గ్రామంలో నూనె గింజల పై అవగాహన కల్పించుటకు రైతులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ విఏఏలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చౌక దుకాణాలు,గ్యాస్ ఏజెన్సీలు నిబంధనలకు లోబడి నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలి



జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

**కాకినాడ, పెన్ పవర్,డిసెంబర్ 12:** జిల్లాలోని చౌక దుకాణాలు మరియు గ్యాస్ ఏజెన్సీలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిత్యవసర సరుకులు, ఎల్పిజీ గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు నాణ్యతతో, సకాలంలో పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ డీలర్లకు ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జేసీ అపూర్వ భరత్ పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు, చౌక దుకాణాల ప్రతినిధులు, గ్యాస్ డెలివరీ బాయ్స్‌తో సమావేశం నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ల పంపిణీ, నాణ్యత, డెలివరీ విధానం, వినియోగ దారుల ఫిర్యాదులపై సమగ్ర సమీక్ష చేశారు. జేసీ మాట్లాడుతూ,"జిల్లాలో పలు గ్యాస్ ఏజెన్సీలపై అందుతున్న ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకొని, డిస్ట్రిబ్యూటర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు, నిర్ణీత సమయంలోనే గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయాలి. 15 కిలోమీటర్ల పరిధిలో అదనపు ఛార్జీలు వసూలు చేయరాదు" అని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదనపు ధరలు వసూలు చేసే డెలివరీ బాయ్స్, ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ల పంపిణీపై లీగల్ మెట్రాలజీ మరియు సంబంధిత శాఖల అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఐవీఆర్ ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో జిల్లాకు దీపం-2 పథకంలో 9వ ర్యాంక్ వచ్చినట్లు జేసీ తెలిపారు. ఈ ర్యాంక్‌ను మెరుగుపర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులు వచ్చిన ఏజెన్సీలకు షోకాస్ నోటీసులు జారీ చేసి, అందిన వివరణ ఆధారంగా తగిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. అలాగే చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేసే నిత్యవసర సరుకులు నాణ్యతగా ఉండాలని,సకాలంలో లబ్ధిదారులకు అందేలా చూడాలని డీలర్లను ఆదేశించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారి ఆర్.ఎస్. ఎస్.సత్యనారాయణ రాజు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్, సివిల్ సప్లయిస్ అధికారులు, డిప్యూటీ తహశీల్దార్లు,గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, చౌక దుకాణాల డీలర్లు, గ్యాస్ డెలివరీ బాయ్స్ పాల్గొన్నారు.

# వృధాగా పోతున్న త్రాగునీరు- పట్టించుకోని అధికారులు

**వై రామవరం పెన్ పవర్ డిసెంబర్ 12:** ప్రజల అవసరాల కోసం ఉపయోగించే త్రాగునీరు వృధాగా పోతున్న సంబంధిత సచివాలయం సిబ్బంది, అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికుల ఆరోపిస్తున్నారు.

మండలంలోని చవిటి దిబ్బల గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, లూథరన్ ఎయిడెడ్ పాఠశాల ఎదురుగా పంచాయతీ పైప్ లైన్ లీకు అయ్యి నీరు వృధాగా పోతోందని స్థానికులు అంటున్నారు. అసలే త్రాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతుంటే, ప్రజలకు చేరవలసిన త్రాగునీరు వృధాగా పోతుందని అంటున్నారు. పైప్ లైన్లను సరి చేయాల్సిన అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికుల ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పైప్ ల లీకేజీలను సరిచేసి ప్రజల అవసరాలకు నేటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.



# క్రిస్మస్ వేడుకల పనుల్లో నిమగ్నమైన ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 12.**
స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో క్రిస్మస్ వేడుకలు జరగనున్నాయి. నల్లజర్ల గ్రామ శివారులో జాతీయ రహదారి ప్రక్కన జరగనున్న ఈ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను ఎమ్మెల్యే మద్దిపాటి శుక్రవారం పరిశీలించారు. క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యేవారు రావడానికి వీలుగా రహదారులు ఏర్పాటు చేశారు. అలాగే వాహనాలు నిలిపే ప్రదేశం, స్టేజి ఏర్పాటు వంటి వాటిని పరిశీలించి పని సూచనలు చేశారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ క్రిస్మస్ వేడుకలకు నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల నుండి సుమారు 20వేల మంది హాజరయ్యే అవకాశం ఉందన్నారు. అందుకు తగ్గట్టుగానే త్రాగునీరు, భోజనం తదితర ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వెంట గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మ రాజు, పలువురు క్రైస్తవ మత బోధకులు ఉన్నారు.

# కోలంక సొసైటీలో డీసీసీబీ బ్యాంకు ఆధ్వర్యంలో బుర్రకథ అవగాహన కార్యక్రమం విజయవంతం



**కాకినాడ పెన్ పవర్, డిసెంబర్ 12:** డీసీసీబీ బ్యాంకు ఆధ్వర్యంలో మిరియాల రమేష్ కళాబృందం నిర్వహించిన లోన్లు, సైబర్ క్రైమ్స్ మరియు బ్యాంకింగ్ సేవలపై బుర్రకథ అవగాహన కార్యక్రమం కోలంక సొసైటీ వద్ద శుక్రవారం విజయవంతంగా జరిగింది. రైతుల సక్రియ పాల్గొనడం ఈ కార్యక్రమానికి విశేష ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పిఏసిఎస్ ప్రెసిడెంట్ బొండా వెంకట నరసింహ నాయుడు రైతులకు ధన్యవాదాలు తెలిపి, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు గ్రామీణ రైతులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా

ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



**కాకినాడ, పెన్ పవర్,డిసెంబర్ 12:** ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా విని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు తెలిపారు. శుక్రవారం జగన్నాధపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి అనేక అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ,"ప్రజల సమస్యలు ఎప్పుడైనా వినడమే కాకుండా, ప్రతీ శుక్రవారం ప్రత్యేకంగా ప్రజల విజ్ఞప్తులు,ఫిర్యాదులు స్వీకరించేలా ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నాం. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ప్రతి శుక్రవారం 'గ్రీవెన్స్ డే'గా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని బలోపేతం చేస్తున్నాం" అని తెలిపారు. వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపి, సమస్యలకు త్వరిత పరిష్కారం కల్పించే చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలపై నిరంతరంగా పనిచేయడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జులు, కూటమి శ్రేణులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కాకినాడలో 18 ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు

**★ త్వరలో ప్రజా వినియోగంలోకి : ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**

**కాకినాడ, పెన్ పవర్,డిసెంబర్ 12:** కాకినాడ నగర ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచేందుకు నగరంలోని 18 ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నామని, వీటిని త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ వెల్లడించారు. శుక్రవారం కమిషనర్ ,డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్టీజీఎస్ అమలు, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, ఆటోల నియంత్రణ, శునకాల నిర్వహణపై సుప్రీం కోర్టు ఆదేశాల అమలు, అన్నకాంటీన్ సేవల మెరుగుదల వంటి అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, ఆర్టీజీఎస్‌లో లోపాలు లేకుండా చర్యలు తీసుకున్నామని, ట్రాఫిక్ సిగ్నల్ ప్రతిష్టాపన బాధ్యతలను రెండు ఏజెన్సీలకు అప్పగించామని తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయిలో సిగ్నల్స్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే నగరంలో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంపొందించే దిశగా యుఎల్బిలు చర్యలు తీసుకుంటు న్నాయని అన్నారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు శునకాల కోసం ప్రత్యేక షెల్టర్ల ఏర్పాటుకు కూడా నగరపాలక సంస్థ సన్నద్ధమవుతోందని వెల్లడించారు. పేదల సంక్షేమానికి ఉపయోగపడే అన్నకాంటీన్ల సేవలను మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన



మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక సలహా కమిటీ ఏర్పాటు జరుగుతోందని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్.ఇ. వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డా. పృధ్వీచరణ్, ఇ.ఇ. కనక రావు, సూపరింటెండెంట్ రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో ప్రభుత్వ కార్యాలయాల కొనసాగింపుపై డిమాండ్

**★ సమావేశం విజయవంతం**



**రామచంద్రపురం, పెన్ పవర్,డిసెంబర్ 12:**
రామచంద్రపురం లో ఉన్న ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ ఆఫీస్, నీటిపారుదల కార్యాలయం తదితర ముఖ్య ప్రభుత్వ శాఖలను ఇతరచోటుకు తరలించే అవకాశాల నేపథ్యంలో,ఈ కార్యాలయాలను రామచంద్రపురంలోనే యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పురపాలక సంఘ భవనం ఎదుట నిర్వహించిన సమావేశం విజయవంతంగా ముగిసింది. రామచంద్ర పురం నియోజకవర్గ ప్రజల అవసరాలు, పరిపాలనా సౌకర్యాలు, పూర్వపు తాలూకా కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతానికి ఉన్న కొనసాగింపు ప్రాధాన్యతను పౌర ప్రతినిధులు వివరించారు. గత 12 సంవత్సరాలుగా ఆర్డీవో కార్యాలయం అందిస్తున్న సేవలు, భూవివాదాలు – రెవెన్యూ సమస్యల పరిష్కారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే, ఈ కార్యాలయాలను తరలించడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించనుందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రామచంద్రపురం వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉండవల్లి గోపాలరావు, సిపిఐఎంఎల్ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు వెంటపల్లి భీమశంకరం, బీజేపీ స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ సలాది సతీష్ నాయుడు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ జాన్ విక్టర్ నంద, డాక్టర్ స్టాలిన్, ఇండిపెండెంట్ అభ్యర్థి ఎర్రంశెట్టి రామరాజు, సీనియర్ అడ్వకేట్ మల్లి హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ప్రజా ప్రతినిధులు రామచంద్రపురంలో ఉన్న ఈ కీలక కార్యాలయాలను తరలించకుండా యథాతథంగా కొనసాగించాలని బలంగా డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాక్ అసెంబ్లీ నిర్వహణ.

**★ యువత రాజకీయాల్లో నాయకులుగా ఎదగాలి : ప్రిన్సిపాల్ డా. డి . సునీత.**



**ఏలేశ్వరం, పెన్ పవర్, డిసెంబర్ 12:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాక్ అసెంబ్లీ ఘనంగా శుక్రవారం నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మాక్ అసెంబ్లీని పొలిటికల్ సైన్స్, ఎకనమిక్స్ , హిస్టీరి విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్య క్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ డా. డి . సునీత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో చదివే విద్యార్థులకు అన్ని రంగాలలో అవగాహన ఏర్పరచుకోవాలని, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని ఉద్దేశ్యంతో మాక్ అసెంబ్లి వంటి చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, దీని వల్ల విద్యార్దులలో విషయ జ్ఞానం పెరుగుతుందని అన్నారు. కొంతమంది విద్యార్దులు వివిద శాఖల మంత్రులుగా మరి కొందరు ప్రతి పక్ష నాయకులుగా , సభ్యులుగా, మిగతా విద్యార్దులు ఎంఎల్ఏ లు గా ఉంటూ ప్రశ్నోత్తరాల సమయంలో అనేక ప్రజా సమస్యలు సభలో లేవనేత్తారు. నిజమైన సభలా నిర్వహించడం లో అధ్యాపకుల కృషి స్పష్టంగా దర్శనమిచ్చింది . స్పీకర్ వారిని చాలా హుందాగా సముదాహిస్తూ సభను నిర్వహించడం విద్యార్థుల్లో అసెంబ్లీ పట్ల అవగాహన తెలియజేసింది. స్పీకర్ స్థానంలో జగదీశ్వరి , ముఖ్య మంత్రి స్థానంలో అభిషేక్, ప్రతి పక్ష నేతగా పరిమళ ఆకట్టుకున్నారు. మొత్తం కార్యక్రమం డా. శివ ప్రసాద్, వీర భద్ర రావు , మేరీ రోజలీనా పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ, అధ్యాపకులు కె. సురేశ్ వి. రామారావు , మదీనా, శ్రీ లక్ష్మి, పుష్పా. డా. బంగార్రాజు, సతీశ్, , రాజేష్. సత్యనారాయణ , ధర్మ రాజు , దివ్య,రామలక్ష్మి ,కమల, కళావతి , కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబరు 12:** జగ్గంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం మానసిక ఆరోగ్యం దాని ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్లీనికల్ సైకాలజిస్టు జి.సాయిరాం, సోషల్ వర్కర్ వీరావతి, పీహెచ్సీ ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు హాజరయ్యారు. ఈసందర్భంగా 9, 10వతరగతి, ఇంటర్ విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ఆవశ్యకత, దాని అవసరం, నిత్యజీవితంలో ఎంత వరకు అనే అంశాలపై వివరించారు. ఆత్మహత్యల ఆలోచనలు ఎలా అధిగమించాలో ఆత్మ సైర్యం నింపుకోవడం, చదువు ఎలా గుర్తు పెట్టుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జివి లలితకుమారి, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

# కాకినాడలో హత్య కేసు 48 గంటల్లో ఛేధనం

**★ ముద్దాయి అత్తిలి రంగ అరెస్ట్**



**కాకినాడ పెన్ పవర్, డిసెంబర్ 12:** కాకినాడ ఎస్సార్కె సెంటర్‌లో ఈ నెల 9న జరిగిన హత్య కేసులో ముద్దాయి అత్తిలి రంగ (42) ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు 3వ పట్టణ సీఐ కె.వి.ఎస్. సత్య నారాయణ వెల్లడించారు. చెప్పులు కుట్టుకునే కీర్తి సత్యనారాయణ (45) పై, మద్యం సేవించి వచ్చిన అత్తిలి రంగ అక్కడే ఉన్న పదునైన చాకుతో ఎడమ ఛాతిపై పొడిచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాధితుడిని జిజిహెచ్‌కు తీసుకెళ్లగా అక్కడే మరణించినట్లు వైద్యులు నిర్ధారించడంతో హత్య కేసు నమోదు చేశారు. సమాచారం అందిన వెంటనే జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, కాకినాడ సబ్ డివిజన్ ఎఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఘటన స్థలాన్ని సందర్శించి, దర్యాప్తును వేగవంతం చేయాలని సూచనలు చేశారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, ఎఎస్పీ పర్యవేక్షణలో పోలీసులు ముద్దాయిని పట్టుకున్నారు. ముద్దాయి తన నేరాన్ని అంగీకరించినట్లు సీఐ తెలిపారు. ఘటనకు ముందు రోజు మృతుడితో తలెత్తిన గొడవను మనసులో పెట్టుకుని, ఉద్దేశ పూర్వకంగా హత్య చేసినట్లు వెల్లడించారు. ముద్దాయి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన చాకు, ధరించిన బట్టలు స్వాధీనపర్చుకున్నారు. హత్య కేసును వేగంగా ఛేదించిన 3వ పట్టణ ఇన్స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ, ఎస్సై ఎం. సాగరబాబు, హెచ్సీ సతీష్, పిసి జి. శ్రీనివాస్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# మాజీ ఎంపీ భరత్ భూకబ్జాపై ప్రభుత్వం విచారణ జరపాలి

**★ చందా సత్రం మాజీ చైర్మన్ రామశర్మ డిమాండ్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్, 12:** నిజాయితీపరుడనని, నగర నగర అభివృద్ధికి తానే ఆద్యుడు నని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తన కార్యాలయం ఉన్న సర్వే నెంబరు 612 స్థలాన్ని భూకబ్జా చేశారని
చందా సత్రం మాజీ చైర్మన్ రామశర్మ ఆరోపించారు. స్థానిక స్థానిక ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, భరత్ కు 2014 నుంచి 2024 వరకు ఆ స్థలం పెరుగుతూ రావడం వెనుక ఏం జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ సర్వే నెంబర్ లోని స్థలాన్ని కబ్జా చేశారని, పైగా ఈ స్థలాన్ని అనుకూని ఉన్న జెమిని గ్రౌండ్ ను కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, యజమానులపై ఒత్తిడి పెంచుతున్నారని విమర్శించారు. మార్గాన్ని ఎస్టేట్లో ఎగ్జిబిషన్ల నిర్వహించే కుంచె సత్య అనే వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందాడని, అతనికి భరత్ మూడున్నర లక్షల బాకీ పడ్డాడని ఆ సంగతిని తన డైరీలో రాసుకున్నాడని తెలిపారు. చనిపోయిన తర్వాత అతని భార్య భరత్ వద్దకు కాళ్లు అరిగేలా తిరిగిన బాకీ



చెల్లించకపోగా, మహిళ అనే కనీస మానవత్వం ప్రదర్శించ లేదని విమర్శించారు. మీడియా ముందు ఆమెతో ఫోన్లో మాట్లాడగా ఆమె బాధ వినిపించింది. అమాయక ప్రజలను మోసం చేస్తున్న మాజీ ఎంపీ భరత్ ను వైసిపి పార్టీ అధిష్టానం పార్టీ నుండి బహిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మద్యం సిండికేట్ ని కాపాడుతున్న నగర ప్రజాప్రతినిధి పై తెలుగుదేశం అధిష్టానం చర్యలు తీసుకోవాలి



**★ నగరంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపులు ఏర్పాటు**

**★ మీడియాలో తెలుగుదేశం నాయకుడు బర్ల బాబురావు ఆరోపణలు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 12:** నగరంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా , గుడికి, బడికి వంద మీటర్ల లోపల మద్యం షాపులు ఏర్పాటు చేశారని తెలుగుదేశం నాయకుడు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బర్ల బాబురావు ఆరోపించారు. నగరంలో 39 షాపులు ఉన్నాయని ఇవన్నీ సిండికేట్ గా మారాయని,
సిండికేట్ కు నగర శాసనసభ్యులు అండగా నిలుస్తున్నారని ఆయన ఆరోపించారు. స్థానిక ప్రెస్ క్లబ్లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న మజ్జి రాంబాబు అనే వ్యక్తి కి లాలా చెరువులో శ్రీనివాస వైన్స్ అనే మద్యం షాప్ ఉందని మద్యం వ్యాపారులతో నగర శాసనసభ్యుడికి, మీడియాకు, ఎక్సైజ్ పోలీసులకు, ముడుపులు ఇవ్వాలని మాట్లాడిన ఆడియోలు ఉన్నాయని తెలిపారు. మాజీ కార్పొరేటర్
కిలపర్తి శ్రీనివాస్ కూడా పై విధంగా ముడుపుల కోసం మద్యం వ్యాపారులను సిండికేట్ కావాలని ఒత్తిడి చేశారని డిమాండ్ చేశారని వీరిద్దరి ఆడియో సాక్షాలు తన వద్ద ఉన్నాయన్నారు. కిలపర్తి బ్రాందీ షాపులో తెల్లవారుజామునుండే బెల్ట్ షాపు నడుపుతున్నారని ఆరోపించారు. నగరంలో 39 షాపులో సగం షాపులు బెల్ట్ షాపులు గా నడుస్తున్నాయిన్నారు. నగరంలో ఏకేసి కాలేజీ ఎదురుగా, లాలాచెరువు బస్టాండ్ దగ్గర జాతీయ రహదారికి 500 మీటర్ల లోపల, దేవాలయాల వద్ద మద్యం షాపులు ఉన్నాయన్నారు. జాతీయ రహదారిపై షాపుల జీవో ఇతర రాష్ట్రానికి సంబంధించిన జీవో అని ,ఆంధ్రప్రదేశ్ కుసంబంధం లేదన్నారు. ఈ ఆడియోలు ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో నకిలీల పై పోరెన్సిక్ ల్యాబ్ లో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మద్యం సిండికేటుకు అండగా నిలిచిన నగర శాసన సభ్యుణ్ణి , ఆ ఇద్దరు అనుచరులపై పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. తన కుమారుడు నడిపే మద్యం షాపుపై నిరాదార ఆరోపణలతో, ఎక్సైజ్ పోలీసులు సహకారంతో నకిలీ కేసు పెట్టించారని, తాను హైకోర్టులో సవాల్ చేయగా ఆ కేసును హైకోర్టు కొట్టి వేసిందన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకుడు పితాని కుటుంబరావు పాల్గొన్నారు.

# అనకాపల్లి నుండి తిరుమలకు గోవింద మాలతో పాదయాత్ర



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 12:** అనకాపల్లి నుండి తిరుపతి పాదయాత్రగా పదిమంది గోవింద మాలదారులు ఈనెల 7వ తేదీ ఆదివారం బయలుదేరారు. ఈ పాదయాత్ర 11తేదీ రాత్రి కాకినాడ జిల్లా జగ్గంపేటకు చేరుకుంది. ఆ పాదయాత్ర బృందానికి జగ్గంపేట మోహన్ కృష్ణ రెసిడెన్సిలో భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి ఉండడానికి బస, భోజన వసతి ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం తిరిగి పాదయాత్రగా ముందుకు బయలుదేరిన గోవిందులకు నాగేంద్ర చౌదరి ఏర్పాటుచేసిన పండ్లు, దుప్పట్లును ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా అందించి, వారిని పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారితో కలసి గోవింద నామస్మరణతో కొంత దూరం పాదయాత్ర వేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుబిగించాలన్నారు. సుమారు 800 కిలో మీటర్లు తిరుపతి కాలినడకన బయలు దేరిన వీరి పాదయాత్ర ఆ గోవిందుని దయతో సఫలీకృతం కావాలన్నారు. గోవిందుల అభ్యర్థన మేరకు స్వామి వారి దర్శనానికి తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ప్రతిరోజు నాగేంద్ర చౌదరి అనేక దేవస్థానాలకు పాదయాత్రగా వెళుతున్న భక్తులకు ఆశ్రయము ఇచ్చి భోజన కల్పిస్తున్నారని హిందూ ధర్మ పరిరక్షణ కోసం, గో రక్షణ కోసం ఆయన చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు.

# పెనుమళ్ల జడ్‌పీ హైస్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**★ సర్పంచ్ పోతుల భవాని దంపతులను సత్కరించిన ఉపాధ్యాయులు**



**కాజులూరు, పెన్ పవర్,డిసెంబర్ 12:**
కాజులూరు మండల పరిధిలోని పెనుమల్ల జడ్‌పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను స్థానిక గ్రామ సర్పంచ్ పోతుల భవాని,భీమరాజు శుక్రవారం ఉదయం ఉపాధ్యా యులు మరియు కూటమి నాయకుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం సర్పంచ్ పోతుల భవాని దంపతులను ఘనంగా సత్కరించింది. పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడం వలన వారు మరింత ఉత్సాహంతో చదువులో రాణించే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వనం వీరబ్రహ్మం,హైస్కూల్ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రపంచం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్.

**★ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతులనెహ్రూ.**

**కిర్లంపూడి, పెన్ పవర్, డిసెంబర్ 12:** ప్రపంచం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అటువంటి మహనీయుని విగ్రహాన్ని ఆవిష్కరించడం నా అదృష్టమని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకవర్గ సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం జగపతినగరం గ్రామ పంచాయతీ ప్రాంగణంలో సర్పంచ్ గుడాల శ్రీ లతారాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ అంబేద్కర్ ఈ దేశానికి సమానత్వం, స్వతంత్రత, న్యాయం అనే విలువలను బలపరిచిన మహానుభావుడు. అలాంటి మహోన్నతుడి విగ్రహం పంచాయతీ ప్రాంగాణంలో శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి,ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, సొసైటీ చైర్మన్ లు తోట గాంధీ,కుర్ల చినబాబు,సర్పంచ్ గుడాల శ్రీలతా రాంబాబు, ఉప సర్పంచ్ గౌతు జగన్నాధరావు, మండల టిడిపి అధ్యక్షులు వీరంరెడ్డి కాశీబాబు,నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు చదరం చంటిబాబు, తూము కుమార్, కాళ్ళ వెంకటేష్,ఎంపిటిసి సాదే కుమారి, ఎంపీడీవో బావిశెట్టి హరికృష్ణ, కిర్లంపూడి ఎస్ఐ,జి సతీష్, తహసీల్దార్ జె చిరంజీవి, కార్యదర్శి ఎన్ టి ఆర్ రమేష్ బాబు, దళిత నాయకులు కట్టు సూరిబాబు, కట్టు నాని, సలాది నేరియ్య, సాదే



డేవిడ్ రాజు పలువురి కూటమి నాయకులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com